
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి జిల్లా వార్తలు

మంగళవారం 11 నవంబరు 2025

ఒడిశా టూ శివకాశి

- తిరుపతిమీదుగా గంజాయి అక్రమ రవాణా
- ఒకరి అరెస్టు, 32 కిలోలు స్వాధీనం



సీజ్ చేసిన గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి తిరుపతి మీదుగా తమిళనాడుకు తరలిస్తున్న 32 కిలోల గంజాయిని చంద్రగిరి పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు పొన్నుస్వామి సెల్వరాజ్‌ను అరెస్టు చేశారు. ఈ వివరాలను సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం శివగంగై జిల్లా కలనివాసలేకు చెందిన పొన్నుస్వామి శెల్వరాజ్ ఒడిశాలో కొంతకాలం చదువుకున్నాడు. ఆ సమయంలో అతడికి గంజాయి స్మగ్లర్లతో సంబంధాలు ఏర్పడ్డాయి. సులభ సంపాదన కోసం ఇతరుల ప్రోద్బలంతో వాహనం తీసుకుని ఒడిశా వెళ్లాడు. తనకు సంబంధాలున్న స్మగ్లర్లను కలిశాడు. పోలీసులకు కనిపించకుండా ఉండేలా వాహనంలోని డాష్ బోర్డు, గేర్ బాక్సు, టైర్ స్టెప్ భాగంలో గంజాయి ఉంచుకుని బయలుదేరాడు. ఎస్పీకి అందిన సమాచారం మేరకు తిరుపతి- నాయుడుపేట జాతీయ రహదారి తువ్వచేనుపల్లి వద్ద చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ సురేష్‌కుమార్, పాకాల సీఐ సుదర్శన్‌కుమార్, ఆర్‌సీపురం ఎస్ఐ భక్తవత్సలం, చంద్రగిరి ఎస్ఐ అనిత, సిబ్బంది కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వీరి వాహనంలో దాచి వుంచిన దాదాపు రూ.6 లక్షల విలువైన 32.730 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తీసుకెళుతున్న తమిళనాడుకు చెందిన పొన్నుస్వామి శెల్వరాజ్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు రవాణా చేసినా, వినియోగిస్తున్న వారి వివరాలు అందించాలని, వారి పేర్లు గోప్యంగా వుంచుతామని ఎస్పీ చెప్పారు. ఎర్రచందనం కేసుల్లో ఇటీవల నిందితులకు 80 శాతం వరకు కఠినంగా శిక్షలు పడుతుండడం అభినందనీయమన్నారు.

4 పరిశ్రమలు..
రూ.3,972 కోట్లు

శ్రీసిటీ, నాయుడుపేటలో ఏర్పాటుకు అనుమతి

మరిన్ని ప్రతిపాదనలనూ ఆమోదించిన మంత్రిమండలి

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో రూ.1,629 కోట్లు, నాయుడుపేటలో రూ.2,343 కోట్ల చెప్పున రూ.3,972 కోట్లతో నాలుగు పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ మేరకు సోమవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో జిల్లాకు సంబంధించి పలు ప్రతిపాదనలను ఆమోదించారు. శ్రీసిటీలో రూ. 550 కోట్ల పెట్టుబడితో 1130 ఉద్యోగాలు కల్పించేందుకు మెస్సర్స్ ఎస్‌సీబీసీ వెంచర్స్ ఎల్‌ఎల్‌పీ సంస్థ ముందుకొచ్చింది. పీసీడీఏ మానుఫ్యాక్చరింగ్, బీఎల్‌డీసీ మోటార్స్, కాపర్ ట్యూబ్స్ మాన్యుఫ్యాకరింగ్ ఫెసిలిటీ ఏర్పాటుకు ఈ సంస్థ చేసిన ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదించింది. పారిశ్రామిక విధానంకింద అవసరమైన రాయితీలు, మినహాయింపులు ఇవ్వడానికి అంగీకరించింది. అలాగే రూ.1079 కోట్లతో 1500మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ మెస్సర్స్ క్రియాన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆసక్తి చూపింది. ఐటీ ఎన్‌క్లోజర్స్, పీసీబీ బేర్ బోర్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటుకు ప్రతిపాదించగా మంత్రిమండలి ఆమోదించింది.

నాయుడుపేటలో రూ.2343 కోట్లతో..

నాయుడుపేటలో సోలార్ పవర్ కేటగిరీలో మెస్సర్స్ వేల్డ్‌సన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 1748 కోట్ల పెట్టుబడితో 4 గిగావాట్స్ సోలార్ సెల్ అండ్ మాడ్యూల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. 415 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ప్రతిపాదించింది. ఈ సంస్థకు 40 ఎకరాలు కేటాయించేందుకు మంత్రి మండలి అంగీకరించింది. నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్కులో మెస్సర్స్ గ్రీన్ లామ్ సౌత్ లిమిటెడ్ రూ. 595 కోట్ల పెట్టుబడితో పార్టికల్ బోర్డ్ అండ్ లామినేట్ యూనిట్ నెలకొల్పేందుకు ప్రతిపాదించింది. రోజుకు 650 సీబీఎంసామర్థ్యంతో ఉత్పత్తిచేస్తామని, తద్వారా 850మందికి ఉద్యోగావకాశాలుకల్పిస్తామని ప్రతిపాదించగా మంత్రిమండలి అనుమతిచ్చింది.

తిరుపతిలో టీడీపీ ఆఫీసుకు భూమి కేటాయింపు

తిరుపతిలో టీడీపీ పార్లమెంటు కమిటీ కార్యాలయ భవనం కోసం రెండెకరాల ప్రభుత్వ భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించేందుకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామం సర్వే నంబరు 495-5లో 1.85 ఎకరాలు, సర్వే నంబరు 495-11లో 15 సెంట్లు చొప్పున మొత్తం రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని తిరుపతి పార్లమెంటు టీడీపీ కమిటీ అధ్యక్షుడి పేరిట 33 ఏళ్ళ పాటు లీజుపై కేటాయించనున్నారు. ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి చొప్పున లీజు చెల్లించే ప్రాతిపదికన భూమి కేటాయించనున్నారు.

ఎపిటోమ్ సంస్థకు 19 ఎకరాలు

నాయుడుపేట ఎంపీఎస్‌ఈజెడ్‌లో మెస్సర్స్ ఎపిటోమ్ కాంపొనెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పీసీడీలు, అనుబంధ ఎలక్ట్రానిక్ కాంపొనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ ఫెలిసిటీ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ సంస్థకు 19.06 ఎకరాల భూమి కేటాయించేందుకు మంత్రి మండలి ఆమోదించింది.

కోవనూరులో టిడ్కోకు 32.21 ఎకరాలు

కేవీబీపురం మండలం కోవనూరులో పీఎంఏవై 2.0 పథకం కింద ఎన్టీఆర్ నగర్ పేరిట పేదలకు ఇళ్ళు నిర్మించివ్వడం కోసం టిడ్కోకు 32.21 ఎకరాలను కేటాయించేందుకు మంత్రి మండలి అంగీకరించింది. కోవనూరు గ్రామం సర్వే నంబరు 363-1లో 19.27 ఎకరాలు, సర్వే నంబరు 365లో 12.94 ఎకరాలు చొప్పున కేటాయించనున్నారు. ఎకరా రూ.18.55 లక్షల చొప్పున రూ.5.97 కోట్లకు భూములు కేటాయించేలా నిర్ణయించింది. ఆ మొత్తాన్ని టిడ్కో 2025-26 నుంచీ 2029-30 నడుమ ఐదు వాయిదాలలో చెల్లించే వెసులుబాటు కల్పించారు.



శిరసనంబేడులో ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

పెళ్లకూరులో
ఎంఎస్‌ఎంఈ పార్కు

- నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న సీఎం
- ప్రత్యక్షంగా పాల్గొననున్న మంత్రి నిమ్మల

పెళ్లకూరు, నవంబరు, 9(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం శిరసనంబేడు, పాలచ్చూరు పరిధిలో రూ.447 కోట్ల పెట్టుబడులతో మూడు పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం ఉదయం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నేరుగా పాల్గొననున్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం 2009లో శిరసనంబేడులో 58.33 ఎకరాలు సేకరించారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చెన్నప్పనాయుడుపేట, నందిమాల, ఎర్రగుంట గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటుకు భూపరిశీలన చేసింది. స్థానిక రైతులు సహకరించకపోవడంతో పూర్తిస్థాయిలో భూసేకరణ జరగలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక పారిశ్రామికవాడ అభివృద్ధి మరుగున పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో శిరసనంబేడులో సేకరించిన 58.33 ఎకరాల్లో మొదటి విడతలో 22.42 ఎకరాలు, రెండో విడతలో 35.91 ఎకరాలు అభివృద్ధి చేయనున్నారు. పాలచ్చూరులో రూ.137 కోట్లతో 3ఎక్స్‌పెర్ ఇనోవెంచర్ పరిశ్రమ ప్రారంభోత్సవంతో పాటు రూ.245 కోట్లు దమ్ము బయోఫ్యూయల్ పరిశ్రమకు వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.





లక్ష దీపోత్సవం

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజతీర్థంలో సోమవారం సాయంత్రం లక్ష దీపోత్సవం నిర్వహించారు. భరద్వాజతీర్థం చుట్టూ క్రమపద్ధతితో నేతిదీపాలను సిద్ధం చేశారు. భక్తులు దీపాలు వెలగించారు. నేతి దీపకాంతులతో పుష్కరణి వెలుగులీనింది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



కోటి దీపోత్సవం

తిరుపతిలోని రామచంద్ర పుష్కరిణి వద్ద ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కార్తీక కోటి దీపోత్సవం జరిగింది. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి హాజరై భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. మహిళా భక్తులు దీపాలు వెలిగించారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

కపిలతీర్థం వద్ద..

కార్తీక సోమవారం సందర్భంగా తిరుపతి నగరం కపిలేశ్వరాలయం పక్కనున్న ఉద్యానవనంలో సాయంత్రం భక్తులు దీపాలు వెలిగించారు. కపిలేశ్వరస్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానము

శ్రీకాళహస్తి :: తిరుపతి జిల్లా - 517 644

ఈ - ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డ్ టెండర్ ప్రకటన

ఆర్.సి.నెం. A2/5742/2025 తేది :08-11-2025

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానము నందు **తేది: 10-02-2026** నుండి **తేది: 23-02-2026** వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు-2026 సందర్భముగా అవసరమైన ఏర్పాట్ల నిమిత్తం క్రింద తెలిపిన వివరముల ప్రకారం టెండర్లు ఆహ్వానించడమైనది.

	ఈ - ప్రొక్యూర్‌మెంటు టెండర్లు	EMD	టెండరు తేది
01.	ప్రత్యేక పూల అలంకరణ (తేది:10-02-2026) నుండి తేది: 23-06-2026వరకు 14రోజులు)	రూ.3,00,000/-	Bid downloading start:12-11-2025, End:26-11-2025 Price bid open: 28-11-2025
02.	ఫొటోలు, వీడియోలు కవరేజ్ (తేది:10-02-2026) నుండి తేది: 23-06-2026వరకు 14రోజులు)	రూ.2,00,000/-	-do-
	సీల్డు టెండర్లు	EMD	టెండరు తేది
03.	ఆటో రిక్షా ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్	రూ.5,000/-	షెడ్యూలు దరఖాస్తు చివరి తేది:24-11-2025 షెడ్యూలు జారీ చేయు తేది:27-11-2025, షెడ్యూలు టెండరు బాక్సునందు సమర్పించు తేది: 28-11-2025 ఉ॥10-30 నుంచి మ॥1-00లోపు
04.	కొబ్బరి ఆకు తోరణముల అలంకరణ	రూ.10,000/-	-do-
05.	గొడుగులు, సురిటీలు, కర్టెన్లు మరియు ఇతర అలంకరణ సామాగ్రి సరఫరా	రూ.20,000/-	-do-
06.	మెమెంటోలు సరఫరా	రూ.20,000/-	-do-

ఆసక్తి గల వారు పైతెలిపిన టెండర్లకు సంబంధించి **www.eprocurement.gov.in** వెబ్‌సైట్‌నందు మరియు కార్యాలయపు పని వేళలయందు 96185 15658, 98664 56141, 99894 14040 సంప్రదించవచ్చును.

శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి సేవలో.. సం/- **తిప్పారెడ్డి బాపిరెడ్డి,** కార్యనిర్వహణాధికారి



ఎట్టా బతికేదీ?

'నా భర్త చనిపోయి ఒకటిన్నర ఏడాదైంది. పిల్లలు పట్టించుకోవడం లేదు. పింఛను రాలేదు. ఎలా బతికేది' అంటూ సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ ఎదుట తిరుపతికి చెందిన అంజమ్మ విలపించారు. ఆమెకు వచ్చే నెల నుంచి పింఛను ఇవ్వాలని, రెండు నెలలకు సరిపడే రేషన్ అందించాలని ఆదేశించారు. తన వద్ద ఉన్న రూ.4వేలు అంజమ్మకు ఇచ్చి ఇంటి వద్ద వదిలి రావాలని సిబ్బందిని పంపారు. ఇలా కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో పలువురు తమ బాధలు చెప్పుకొంటూ 266 అర్జీలిచ్చారు.

వేదం.. వివాదం

- ప్రారంభమైన వేద పారాయణ ఇంటర్వ్యూలు
- ఆ అబ్జర్వర్‌ను తొలగించాలని టీటీడీకి ఫిర్యాదు

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చేపట్టిన వేద పారాయణ పోస్టుల ఇంటర్వ్యూల్లో తొలిరోజే వివాదం మొదలైంది. 700 పోస్టులకుగాను తిరుపతిలోని శ్వేతలో సోమవారం మొదలైన ఇంటర్వ్యూలు 16వ తేదీ వరకు జరగనున్నాయి. తొలిరోజునే ఇంటర్వ్యూలలో అకడమిక్ ఎక్స్‌టర్నల్ అబ్జర్వర్‌గా నియమితులైన ప్రొఫెసర్ సుదర్శన్ శర్మపై టీటీడీ ఛైర్మన్, ఈవో, జేఈవోలతో పాటు పాలకమండలి సభ్యులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఆయన ఓవిశ్వవిద్యాలయంలో వైస్‌చాన్సలర్‌గా పనిచేసిన సమయంలో ఆర్థిక అక్రమాలు, పరిపాలనా లోపాలు, అవినీతికి సంబంధించిన అంశాలపై టీటీడీ విజిలెన్స్ నిగ్గుతేల్చిన నివేదికలను, ఆయనపై వచ్చిన ఆరోపణలను ఆధారాలతో సహా పాలక మండలికి పంపారు. ఇలాంటి నేపథ్యం కలిగిన వ్యక్తిని అబ్జర్వర్‌గా నియమించడం అనుచితమని భావిస్తున్నారు. ఉజ్జయిని వేద విద్యా ప్రతిష్ఠ వైస్ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో కూడా పలు అక్రమాల ఆరోపణలను ఆయన ఎదుర్కొన్నారు. ప్రస్తుత ఇంటర్వ్యూలలో కూడా తమిళ - తెలుగు అనే భేదాన్ని ప్రోత్సహిస్తూ, వేదానికి భాషాపరమైన విభేదం ఉన్నట్టుగా చూపించి, బ్రాహ్మణుల్లో ఆందోళన సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. సుదర్శన్ శర్మను అబ్జర్వర్‌గా తప్పించి, వేద జ్ఞాన ఆధారంగానే ఇంటర్వ్యూలు నిర్వహించాలని కోరుతున్నారు.

అలిపిరి నడకదారిలో అపచారం

- ఉప్పుచేపలు తిన్న పారిశుధ్య కార్మికులు
- విధుల నుంచి తొలగించిన టీటీడీ

తిరుమల, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): తిరుమల కాలినడక మార్గంలో పారిశుద్ధ్య కార్మికులు భోజనంలో ఉప్పుచేపలను తింటున్న వీడియో వైరల్ కావడంతో, వారిని టీటీడీ విధుల నుంచి తొలగించింది. ఆదివారం మధ్యాహ్నం అలిపిరి మెట్ల మార్గంలో పారిశుధ్యకార్మికులు కొందరు భోజనాలు చేస్తున్నారు. వారు ఉప్పుచేపలు తింటున్నారని గుర్తించిన కొందరు భక్తులు పవిత్రమైన తిరుమల నడకమార్గంలో ఎలా తింటారంటూ ప్రశ్నిస్తూ దానిని వీడియో తీశారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్ అయ్యింది. దీంతో టీటీడీ హెల్త్ విభాగం తిరుపతికి చెందిన రామస్వామి, సరసమ్మ అనే ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య ఉద్యోగులను విధులనుంచి తొలగించడంతోపాటూ, తిరుమల 2 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈ సంఘటనపై ఫిర్యాదు చేసింది.

ఢిల్లీలో పేలుడుతో తిరుపతిలో హై అలర్ట్

- జిల్లా అంతటా ముమ్మర తనిఖీలు



తిరుపతి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం)/తిరుమల/సూళ్లూరుపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో సోమవారం సాయంత్రం జరిగిన బాంబు పేలుడు ఘటనతో తిరుపతిలో హై అలర్ట్ ప్రకటించారు. దేశ విదేశాల నుంచి తిరుపతి, తిరుమలకు యాత్రికులు వస్తుండడంతో మరింత అప్రమత్తంగా ఉండాలంటూ సెల్ కాన్ఫరెన్సు ద్వారా పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. తిరుపతిలో డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సీఐలు శ్రీనివాసులు, మురళీమోహన్, రామయ్య, రాంకిషోర్‌లు, ఎస్ఐలు, సిబ్బంది వాహనాల తనిఖీలు చేశారు. ఈస్ట్ పరిధిలోని దాదాపు 30 మంది, అలిపిరి పరిధిలో మరో 18 మందిని విచారించి ఫింగర్ ప్రింట్‌లు తీసుకున్నారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. తిరుమలకు చేరుకున్న ప్రతి వాహనాన్ని నిలిపి లోపల తనిఖీలు చేస్తున్నారు. అనుమానితులను విచారిస్తున్నారు. ఇక, షార్‌లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది, మెరైన పోలీసులు, కోస్టల్ గార్డ్‌చే శ్రీహరికోట చుట్టుప్రక్కల ఉన్న అటవీప్రాంతంలో పాటు జలమార్గంలో భద్రతను కట్టుదిట్టం చేశారు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో తనిఖీ చేస్తున్నారు.

చంద్రగిరి

ఇండోర్ స్టేడియం నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం పనులను శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నాని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2018లో ప్రారంభమైన ఇండోర్ స్టేడియం పనులకు వైసీపీ హయాంలో నిధులు ఇవ్వకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.1.50 కోట్లు మంజూరయ్యాయని, దీంతో 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. స్టేడియానికి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు క్రీడా వికాస కేంద్రంగా పేరు పెట్టనున్నట్లు పేర్కొన్నారు. రవినాయుడు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, డిసెంబరులో స్టేడియంను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ స్టేడియంను మల్టీపర్పస్ స్పోర్ట్స్ సెంటర్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ గౌసేబాషా, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్, టీడీపీ సీనియర్ నేత రమేష్‌రెడ్డి, స్పోర్ట్స్ అధికారులు పాల్గొన్నారు.

తెలుగు భాష సాహిత్యానికి వెలుగు సీపీ బ్రౌన్



బ్రౌన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పాకాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష సాహిత్యానికి విశేషమైన సేవలు అందించిన నిజమైన వెలుగు సీపీ బ్రౌన్ అని ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో సోమవారం సీపీ బ్రౌన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకుడు కె.ఈశ్వరబాబు మాట్లాడుతూ తొలి ఆంగ్లం - తెలుగు నిఘంటువు, వేమన పద్యాలు వెలుగులోకి రావడానికి సీపీ బ్రౌన్ కృషి చేశారని తెలిపారు. తాటాకులకే పరిమితమైన ప్రాచీన తెలుగు కావ్యాలను తన సొంత నిధులతో ఆవిష్కరించి వ్యాఖ్యానాలు రాయించారన్నారు. అనంతరం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవం నిర్వహించారు. అకౌంట్స్ ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాశిలామణి, అధ్యాపకురాలు రమణమ్మ పాల్గొన్నారు.

ఎంబీయూలో పెన్‌స్టేట్ వర్సిటీ ప్రతినిధుల పర్యటన



చంద్రగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.రంగంపేట సమీపంలో గల మోహన్‌బాబు విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని పెన్‌స్టేట్ యూనివర్సిటీ ప్రతినిధులు సోమవారం సదర్శించారు. పలు అంశాలపై చర్చించి, రెండు వర్సిటీల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేశారు. బృందంలోని ప్రొఫెసర్ వెంకటరామన్, అమండా లూట్జ్, వెండి మొయ్నిహాన్ మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు ప్రారంభ సంవత్సరాలను ఎంబీయూలో పూర్తి చేసి, పెన్‌స్టేట్ యూనివర్సిటీలో ఉన్నత చదువులు కొనసాగించవచ్చునని తెలిపారు. ఉమ్మడి డిగ్రీ ప్రోగ్రాంలు, స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సహాయం వంటి అవకాశాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సహకారం అంతర్జాతీయ అనుభవాన్ని పెంపొందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంబీయూ వీసీ నాగరాజరామారావ్, రిజిస్ట్రార్ సారథి, డీన్ అకాడమిక్స్ పీవీ రమణ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వటుక కాలభైరవ హోమం



ప్రత్యేకాలంకారంలో కాలభైరవుడు

రామచంద్రాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాయలచెరువుకట్ట శ్రీశక్తి పీఠంలో కాలభైరవ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం వటుక కాలభైరవ హోమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మరకతశక్తి కాళీ అమ్మవారితో పాటు కాలభైరవస్వామికి తిరు మంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 9 గంటలకు 11వేల గారెలతో వేదపండితులు మార్తాండ వజ్ర భైరవ హోమాన్ని ప్రారంభించగా మధ్యాహ్నం 12గంటలకు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి పూర్ణాహుతితో ముగించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రంఊంజల్‌సేవ నిర్వహించారు. ఎరం కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ పాల్గొన్నారు.

కళత్తూరు ఎస్సీలను పట్టించుకోని పవన్ : చింతా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ చింతామోహన్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం కళత్తూరులో ముంపునకు గురైన ఎస్సీ కుటుంబాలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పట్టించుకోకపోవడం బాధాకరమని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ పవన్ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్‌లో వచ్చి ఏనుగులు, ఎర్రచందనాన్ని చూసి వెళ్లారే గాని, కళత్తూరు వైపు కన్నెత్తైనా చూడలేదని అన్నారు. సర్వం కోల్పోయిన ఎస్సీలను పరామర్శించడానికి ఒక మంత్రి కూడా రాకపోవడం బాధాకరమన్నారు. రూ.500 కోట్లు ఆస్తినష్టం, వెయ్యి ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ ఎలా ఆపాలో పవన్ తమ వద్దకు వస్తే చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి, శాంతియాదవ్, మునిశోభ, సమీవుల్లా, రావణ్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వండి: సీఐటీయూ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక చీనీ నిమ్మ పరిశోధనా కేంద్రంలో కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జయచంద్ర కోరారు. వేతనాలు విడుదల చేయకపోతే ఆందోళన చేపడతామని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

పాకాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన అడ్వకేట్ రాజశేఖర్‌పై పుత్తూరు కోర్టులో క్లయింట్ సాయిప్రసాద్ దాడిని నిరసిస్తూ స్థానిక న్యాయవాదులు సోమ, మంగళవారం విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఉదయం సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. కోర్టు ఆవరణలో అడ్వకేట్‌పై దాడి ఘటనను ఖండించారు. ఈ మేరకు వినతిపత్రాన్ని జూనియర్ సివిల్ జడ్జికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.గురుస్వామి నాయుడు, ఉపాధ్యక్షుడు టీసీ రెడ్డెప్పనాయుడు, కార్యదర్శి జి.చంద్రశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జీవశాస్త్రం ప్రాజెక్ట్ వర్క్‌లో గాయత్రి ప్రతిభ



పాకాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవశాస్త్రం ప్రాజెక్ట్ వర్క్‌లో దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గాయత్రి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్లు హెచ్ఎం సమతమ్మ తెలిపారు. సోమవారం తిరుపతిలో నిర్వహించిన విజ్ఞాన మేళాలో ప్రతిభ కనబరచి గాయత్రి ప్రథమ బహుమతి అందుకోవడంపై హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర మొదలియర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శరవణ

పాకాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మొదలియర్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పాకాలకు చెందిన టీడీపీ నేత ఎస్.శరవణ నియమితులయ్యారు. శరవణ మాట్లాడుతూ మొదలియార్ల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనను నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎన్డీఏ కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ బోయపాటి నాగరాజనాయుడు, పాకాల ముదలియర్ సంఘం నేతలు ఎస్.దేవగురునాథన్, పళణి, నీలకంఠన్, కనకరాజ్, రమేష్, వి.రాజగోపాల్ తదితరులు ఆయన్ను అభినందించారు.

ఏపీఎంఎస్ఎంఈ డైరెక్టర్‌గా చిన్నబాబు

రామచంద్రాపు రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా చిన్నబాబు (మురళీమోహన్)ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమ్మ పల్లి గ్రామానికి చెందిన చిన్నబాబు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. తనకు పదవి అప్పగించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యేలు నాని, భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పవన్ పర్యటన హాస్యాస్పదం : భూమన

తిరుపతి(జీవకోన), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తిరుపతి పర్యటన హాస్యాస్పదంగా సాగిందని సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. మామండూరు అడవుల్లో మొక్కలు నాటడం, నల్ల అద్దాలు పెట్టుకుని పుస్తకాలు చదవడం చూసి జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అడవిలో మొక్కలు నాటడం, పొంగి పొరలే నదుల్లో నీరు పోయడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు.

ఘనంగా అటవీ అమరవీరుల దినోత్సవం



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న అటవీశాఖ అధికారులు

మంగళం, న వంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరు పతిలోని జూపార్కు వద్ద జూఇన్‌లో సోమ వారం రాష్ట్ర అట వీ అమర వీరుల దినో త్సవాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమరవీరుల స్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విధి నిర్వహణలో అమరులైన వారి సేవలను గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబాలను సన్మా నించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్‌దండే, పీసీసీఎఫ్ చలపతి రావు, సీసీఎఫ్ సెల్వం, తిరుపతి, అన్నమయ్య జిల్లాల అటవీశాఖ అధికారులు సాయిబాబా, జగన్నాథ్‌సింగ్, బయోట్రిమ్ స్టేట్ సెల్లి కల్చరిస్టు బబిత, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో రామ కొండారెడ్డి, ఎఫ్ఆర్వోలు సుదర్శణరెడ్డి, మాధవి, సుబ్బరాయులు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు







ముక్కోటిలో చందనాలంకరణలో స్వామివారు- స్వర్ణముఖి నదిలో త్రిశూల స్నానం- మల్లేశ్వరాలయంలో దానిమ్మ గింజల అలంకరణలో స్వామివారు

చంద్రగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరాలయంలో ఈ నెల 10 నుంచి జరుగుతున్న రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి, చందన అలంకరణ చేశారు. ఆనందవల్లిదేవికి అభిషేకం నిర్వహించి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. 10.30 గంటలకు స్వామివారి ఆయుధమైన త్రిశూలానికి అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిశూలాన్ని ఆలయ ప్రదక్షిణగా ఊరేగిస్తూ, ఆలయ సమీపంలోని స్వర్ణముఖి నదిలో శివనామస్మరణ నడుమ త్రిశూల స్నానం చేపట్టారు. అదే సమయంలో భక్తులు పుష్కరిణిలో స్నానమాచరించారు. సాయంత్రం 6 గంటలకు ధ్వజావరోహణంతో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో కార్తీక మాసం మూడో సోమవారం స్వామివారికి ఉదయం అభిషేకం చేశారు. దానిమ్మ గింజల అలంకరణ చేశారు. సాయంత్రం డ్రైఫ్రూట్స్ అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శైవాంగ పండితులు శివకుమార్‌శర్మ, ఆలయ కమిటీ పాల్గొన్నారు.

వేదాంతపురంలో కాలువ పోరంబోకు స్థల వివాదం

స్థానికులు, రజకుల మధ్య పోరు

తిరుపతిరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ సర్వే నంబరు 214లోని 56సెంట్ల కాలువ పోరంబోకు స్థలానికి సంబంధించి గ్రామస్తులు, రజకుల మధ్య వివాదం నెలకొంది. స్థానికులు 15మందికి 1991లో ఈ భూమిలో ఇళ్ల పట్టాలు ఇచ్చారని గ్రామస్తులు అంటుండగా.. 2006లో దోబీఘాట్‌కి ప్రొసీడింగ్స్ ఇచ్చారని రజకులు చెబుతుండటంతో వివాదం చోటుచేసుకుంది. ఇప్పటికే ఇరువర్గాలు పలుమార్లు జిల్లా, మండల స్థాయి రెవెన్యూ అధికారులను కలసి ఫిర్యాదులు చేశారు. పోటాపోటీగా నిరసనలు తెలిపి అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ క్రమంలో ఇటీవల రెవెన్యూ అధికారులు స్థల సందర్శన చేసి సర్వే చేపట్టారు. స్థానికులు ప్రభుత్వమిచ్చిన ఇళ్లపటాలను, రజకులు దోబీఘాట్ ప్రొసీడింగ్స్‌ని రెవెన్యూ అధికారులకు అందజేశారని తెలిసింది. న్యాయస్థానంలోనూ తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని రజకులు అంటున్నారు. కాగా, పంచాయతీ పరిధిలో గతంలో పలుదఫాలుగా రజకులకు సర్వేనంబరు 213, 230, 250, 251లలో నాలుగు దోబీఘాట్ల నిర్వహణకు స్థలాలు కేటాయించారు. రజకులు సరిగా దోబీఘాట్ నిర్వహణ(నీటి సదుపాయం, వాషింగ్ ప్లాట్‌ఫామ్స్) చేపట్టకపోవడంతో ఈ స్థలాలు నిరుపయోగంగా మారాయంటూ స్థానికులు విమర్శలు చేస్తున్నారు. గ్రామస్తులకు పట్టాలిచ్చిన స్థలాన్ని స్థానిక రజక సంఘ నేత ప్లాట్లు వేసి కొందరికి క్రయ, విక్రయాలు జరిపారని ఆరోపిస్తున్నారు. అదీకాకుండా ఒక గ్రామ పంచాయతీ పరిధిలోనే ఐదు దోబీఘాట్లకు స్థల కేటాయింపులు చేయడం సరికాదంటున్నారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలు జానెడు ఇంటిస్థలం కోసం అవస్థలు పడుతుంటే దోబీఘాట్‌ల పేరిట కేటాయించిన భూమిని దర్జాగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ రామాంజులనాయక్‌ను వివరణ కోరగా సర్వేనెంబరు 214కి సంబంధించిన స్థలం రెవెన్యూ రికార్డుల్లో కాలువ పోరంబోకుగా నమోదైందని తెలిపారు. గ్రామస్తులు, రజకుల నుంచి డాక్యుమెంట్లు తీసుకున్నామని, పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తామని, అప్పటివరకూ ఆ స్థలంలోకి ఇరువర్గాలు ప్రవేశించరాదని అన్నారు.

దోబీఘాట్లలో రియల్ వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

ఆర్డీవో రామ్మోహన్‌కు వేదాంతపురం గ్రామస్తుల ఫిర్యాదు



తిరుపతిరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేదాంతపురం గ్రామ పంచాయతీలో ప్రభుత్వం దోబీఘాట్లకు మంజూరు చేసిన స్థలాల్లో రియల్ వ్యాపారాన్ని చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో రామ్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గ్రామపరిధిలో నాలుగు దోబీఘాట్లకు స్థలాలను మంజూరు చేసి 15ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఆ స్థలాల్లో దుస్తులు ఉతకడం, వాషింగ్ ప్లాట్‌ఫామ్స్ వంటి నిర్వహణ చేపట్టలేదని తెలిపారు. కాగా సర్వేనంబరు 214లో గ్రామానికి చెందిన 15మంది వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం ఇళ్లపట్టాలు మంజూరు చేసిం దని తెలిపారు. దోబీఘాట్ల స్థలాల్ని రద్దు చేసి గ్రామానికి చెందిన స్థానిక రజకులు, పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయా లని కోరారు. గ్రామస్తులు పి.జయచంద్ర, టి.చిరంజీవి, కె.రవిరెడ్డి, ఎం.మునికుమార్, సి.పరంధామయ్య, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు కేటాయించండి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): నగర పరిధిలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, పి.సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యా లయం ఎదుట ధర్నా చేశారు. వారు మాట్లాడు తూ పేదలకు గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ఈ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత సీఎం చంద్రబాబు పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా హామీ అమలు చేయలేదని విమర్శించారు. ఎమ్మెల్యే మనుషులు ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేస్తుంటే అధికారులు చూస్తూ ఉన్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో రామ్మోహన్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాధవ్, పి.బుజ్జి, నరేంద్ర, జయంతి, హమీద్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 36 వినతులు

తిరుపతి, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 36 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. వినాయక నిమజ్జనం అనంతరం మిగిలిన విగ్రహాలు, వ్యర్థాలు తొలగించాలని, ఎన్జీవో కాలనీలో చెట్లు పెరిగి పాముల బెడద ఎక్కువగా ఉందని, బండారు కాలనీలో గార్బేజ్ పాయింట్ తొలగించాలని, చింతలచేను, ఎరుకుల కాలనీ శ్మశానవాటికకు ప్రహరీ గోడ నిర్మించాలని, హథీరాంజీ కాలనీ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణలను ఆపాలని తదితర సమస్యలపై వినతులు వచ్చినట్లు చెప్పారు. వాటిని సంబంధిత అధికారులకు పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఇంటిగ్రేటెడ్ సెంటర్‌కు అనుసంధానించండి

తిరుమల, నవంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌పై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సోమవారం టీటీడీ అధికారులతో కలిసి సమీక్షించారు. దర్శన క్యూలైన్ల నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు వైకుంఠం క్యూకాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు, లోపల, బయట క్యూలైన్లలోని సీసీ కెమెరాలను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. క్యూలైన్లలో భక్తుల సంఖ్య, కదలికలపై గణాంకాలను ఎప్పటికప్పుడు విశ్లేషించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఐటీ విభాగానికి కావాల్సిన అన్ని సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో టీటీడీ ఐటీ జీఎం ఫణికుమార్ నాయుడు, డీజీఎం వెంకటేశ్వర నాయుడు, డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర, కార్య ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు జయప్రసాద్, రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పార్టీ విధేయుల వారసులకు అవకాశం



కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన శ్రీధర్, వాసులను సత్కరిస్తున్న రవినాయుడు, మహేష్ యాదవ్

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దివంగత టీడీపీ నాయకులు ఎస్వీఎం సుబ్రమణ్యం, తోట వెంకటేశ్వర్లు పార్టీకి చేసిన కృషి ఎనలేనిదని, వారి బాటలోనే కుమారులైన శ్రీధర్, వాసులు నడుస్తున్నారని శాప్ చైర్మన్ రవినాయుడు, గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్ అన్నారు. మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ నేత ఎస్వీఎం శ్రీధర్, కాపు వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తోట వాసుదేవలను సోమవారం సత్కరించి, అభినందనలు తెలిపారు. పార్టీకి విధేయులైన కుటుంబాలను టీడీపీ ఎప్పటికీ విడిచిపెట్టదని అన్నారు. సత్కరించిన వారిలో రంజిత్, హరికృష్ణ, సునీల్ ఉన్నారు.

డయల్ యువర్ సీఎండీకి విశేష స్పందన

తిరుపతి(ఆటోనగర్), నవంబరు10(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి నిర్వహిస్తున్న డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ వెల్లడించారు. తిరుపతిలోని సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి 76 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. సమస్యలను అధ్యయనం చేసి 15 రోజుల్లో పరిష్కరించడానికి ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. గత వారం 87 సమస్యలు రాగా 62 పరిష్కరించామని వెల్లడించారు. మిగిలిన సమస్యలపైనా అధ్యయనం చేస్తున్నామన్నారు. వినియోగదారులు సమస్యలను టోల్ ఫ్రీ నంబర్లు 1912, 1800 4251555333కి కాల్ చేసి పరిష్కరించుకోవాలన్నారు. అలాగే 9133331912కు చాట్ చేస్తే కూడా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, పి.సురేంద్రనాయుడు, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, జగదీష్‌లు తిరుపతి ఎస్ఈ వి.చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారుల సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న సీఎండీ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సెక్షన్ సప్తగిరి ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మంగళ వారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ సి.గంగాధర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సప్తగిరి నగర్, ప్రశాంతినగర్, ఖాదీకాలనీలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అసౌకర్యాన్ని వినియోగదారులు గుర్తించి, సిబ్బందికి సహకరించాలని కోరారు.

టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఈస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 30 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. అనంతపురానికి చెందిన హజీవల్లి, పశ్చిమ గోదావరికి చెందిన ఏసుబాబు, బాలకుమార్ కొంతకాలంగా తిరుపతిలో మొబైల్ ఫోన్లు అపహరించడం, కర్ణాటక నుంచి సారా ప్యాకెట్లు తెప్పించి విక్రయించడం చేస్తున్నారు. సీఐ శ్రీనివాసులుకు అందిన సమాచారం మేరకు పాత తిరుచానూరు రోడ్డులో తనిఖీలు చేపట్టారు. అక్కడ సారా విక్రయిస్తున్న ఆ ముగ్గురిని అరెస్టు చేసి, 30 కర్ణాటక టెట్రా సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఏపీ కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వరప్రసాద్

తిరుపతి (ఉపాధ్యాయనగర్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా స్థానిక బీజేపీ నేత టి.డి.వరప్రసాద్ నియమితులయ్యారు. తిరుపతికి చెందిన వరప్రసాద్ 22 సంవత్సరాలుగా బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఇదివరకు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు అభినందన



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాల్ మధును టీడీపీ నేత డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం అభినందించారు. ఆయన 20 సంవత్సరాలుగా టీడీపీలో చురుగ్గా పనిచేస్తున్నారని తెలిపారు. దానికి ఇప్పుడు ఫలితం దక్కిందన్నారు.

కూలిన ఇంటి స్లాబ్



తిరుపతి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : తిరు పతి 36వ డివిజన్ మంచాల వీధిలోని ఓ ఇంటిపైకప్పు హఠాత్తుగా కూలిపోయింది. అయితే ఆ సమయంలో అక్కడ కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమా దం తప్పింది. పాత ఇల్లు కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు శ్లాబ్ దెబ్బతినిందని స్థానికులు చెబుతున్నారు. స్థానిక సచివాలయ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేశారు.

కళత్తూరు బాధితులకు చేయూత



నిత్యావసర సరుకులు, చీరలు పంపిణీ చేస్తున్న కుమారమ్మ

తిరుపతి(జీవకోన), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం ఓళ్లూరు రాయలచెరువు తెగిపోవడంతో నిరాశ్రయులైన కళత్తూరు గ్రామ ప్రజలకు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ అండగా నిలిచారు. తన సొంత నిధులతో గ్రామస్తులకు చీరలు, నిత్యావసరాలు, కూరగాయలు, బియ్యం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ బాధితులకు అండగా ప్రభుత్వం అన్ని సహాయక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రామాంజులనాయుడు, రైతు కమిటీ అధ్యక్షుడు గోపిరెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సాదు, సర్పంచ్ గోవర్ధన్, స్టాలిన్, బాబు, విమల్, లక్ష్మిదేవి, మల్లిక, లలిత, కుమారి, రాజా పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



ఆర్థిక సాయం చేస్తున్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కళత్తూరు వరద బాధితుల కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆర్థిక సాయం చేశారు. అనంతరం యూనివర్సిటీ ఉద్యోగుల వద్ద కూడా విరాళాలను సేకరించారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లను వరద సహాయక కార్యక్రమాలకు పంపాలని ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్షుడు నరసన్న, కార్యదర్శి వినోద్, కన్వీనర్ అశోక్ కుమార్ కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడతానని రిజిస్ట్రార్ హామీ ఇచ్చారు.

10మందికి డ్రైవింగ్‌లో శిక్షణ



నూతన బ్యాచ్‌తో అధికారులు

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా షెడ్యూల్డ్ కుల సేవా సహకార సంస్థ ద్వారా 10 మంది యువతీయువకులకు ఉచిత హెవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణ సోమవారం ప్రారంభమైంది. అలిపిరిలోని ఆర్టీసీ డిపో డ్రైవింగ్ స్కూల్లో శనివారంతో శిక్షణ ముగిసిన 35వ బ్యాచ్‌కు వీడ్కోలు పలికి, 36వ బ్యాచ్‌ను ఆహ్వానించారు. ముఖ్య అతిథిగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. డ్రైవర్లు ఓపిక అలవరుచుకోవాలని, ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. క్రమశిక్షణ, డ్రైవింగ్ మెలకువలు నేర్చుకోవాలని కోరారు. ఆర్టీసీ డిపో మేనేజర్ హరిబాబు, నరసింహులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులతో ప్రిన్సిపాల్ భువనేశ్వరి

తిరుపతి(క్రీడలు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గత నెల 20నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీలో శ్రీపద్మావతి మహిళా జూనియర్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. అసాధారణ ప్రతిభ కనబరిచిన ఆర్.మనస్విని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జె.హర్షిత, కె.స్పందన విజేతలుగా నిలిచారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ భువనేశ్వరి వారిని అభినందించారు. పతకాలను, ట్రోఫీని ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ చదువుతోపాటు వివిధ క్రీడల్లో రాణించడం వలన పోటీతత్వం అలవడి భవిష్యత్తులో కాంపిటేషన్ ఎగ్జామ్స్‌కు ఉపయోగపడుతుందన్నారు.

నేడు ఎస్వీయూలో ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు, పత్తిపాటి వివేక్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మంగళవారం ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చర్ అఫైర్స్ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎస్పీ సుబ్బరాయుడు, ఎస్వీయూ వీసీ నర్సింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చర్ అఫైర్స్ డైరెక్టర్ మురళీధర్, కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ తదితరులు పాల్గొంటారు.



తిరుపతి

నేడు తూమాటి దొణప్ప శత జయంతి సభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 : ఆచార్య తూమాటి దొణప్ప శత జయంతి సభను పద్మావతి మహిళా యూనివర్సిటీలో మంగళవారం నిర్వహించనున్నారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పద్మావతి వర్సిటీ సెనేట్ హాల్లో సభ ప్రారంభం కానుంది. వీసీ ఉమ, ఎస్వీయూ తెలుగు విశ్రాంతాచార్యులు గార్లపాటి దామోదర నాయుడు, తూమాటి సుధాకర్, అవధాని మేడసాని మోహన్ తదితరులు పాల్గొంటారని తెలుగు విభాగాధిపతి కొలకలూరి మధుజ్యోతి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ వై.సుభాషిణి, డి.యువశ్రీ తెలిపారు.

సీపీ బ్రౌన్‌కు ఘన నివాళి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పద్మావతి యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి, అధ్యాపకులు వై.సుభాషిణి, డి.యువశ్రీ తదితరులు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. తెలుగు భాష, సాహిత్య రంగాల్లో బ్రౌన్ చేసిన కృషిని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు స్వీకరిస్తున్న విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉజ్జయినిలో నిర్వహించిన సదస్సులో భాగంగా వాద వివాద ప్రతిభా పోటీల్లో తిరుపతి సంస్కృత యూనివర్సిటీ విద్యార్థులు రాజేశ్వర్‌రాటి, మనీషాసాహా మొదటి, ద్వితీయ స్థాయి బహుమతులు అందుకున్నారు. వీరిని సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి అభినందించారు.

పదోన్నతులు ఇవ్వండి

- ఆర్జేడీని కోరిన ఐఈఈఎస్ఏ

తిరుపతి(విద్య), నవంబరు 10 (ఆంధ్రప్రదేశ్): ఇంటర్ విద్యాశాఖలో ఆరోపణలు ఉన్న వారిని పక్కనపెట్టి మిగిలిన వారికి పదోన్నతులు కల్పించాలని ఏపీ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ సర్వీస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఐఈఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు అవ్వారు శ్రీనివాసులు ఆర్జేడీని కోరారు. సోమవారం కడప ఆర్జేడీ సురేష్‌కు ఈ మేరకు మెయిల్ పంపారు. జోన్-4కు సంబంధించి సీనియర్ అసిస్టెంట్ల ప్రమోషన్ కోసం ఇప్పటికే కౌన్సెలింగ్ జరిగిందని, అయితే ఆరోపణలున్న ఇద్దరు ఉద్యోగులను చూపుతూ మొత్తం అందిరికీ ప్రమోషన్లు ఆపివేయడం సరికాదని పేర్కొన్నారు. ఆరోపణలు ఉన్న ఇద్దరు ఉద్యోగులు ఆర్జేడీ సహా ఉన్నతాధికారులను తప్పుదారి పట్టిస్తున్నారంటూ వివరించారు. వాస్తవాలను గుర్తించి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు.

మహిళ మెడలోని చైను అపహరణ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో 67ఏళ్ల మహిళ మెడలోని బంగారు చైన్‌ను గుర్తు తెలియని యువకులు అపహరించారు. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. నలందనగర్‌లో కాపురమున్న అనసూయ సోమవారం ఉదయం పక్కనే ఉంటున్న తన చిన్న కుమారుడి ఇంట్లో పూజలో పాల్గొని తిరిగి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న ఆరు సవర్ల బంగారు బొందు చైను లాక్కొని పరారయ్యారు. ఒక యువకుడు హెల్మెట్, మరొకరు మాస్క్ వేసుకుని ఉన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ చెప్పారు.

వేడుకగా కార్తీక కోటి దీపోత్సవం

- హాజరైన కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి
- పెద్దయెత్తున పాల్గొన్న భక్తులు



కోటి దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక కోటి దీపోత్సవం తిరుపతిలో అత్యంత వేడుకగా సాగింది. రామచంద్ర పుష్కరిణి వద్ద తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి హాజరై భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నగర ప్రజలను ఒకచోటకు చేర్చి కోటి దీపోత్సవం నిర్వహించడం సంతోషకరమన్నారు. నగర యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి మంచి కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, టీటీడీ మాజీ అధ్యక్షుడు చదలవాడ కృష్ణమూర్తి, ప్రముఖ పారిశ్రామికవేత్త పీసీ రాయులు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేతలు నరసింహయాదవ్, బీజేపీ నేత నవీన్‌కుమార్ రెడ్డి, దాదాపు 1,500 మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ప్రెసిడెంట్ వైఎస్ బాబు, కార్యదర్శి శేషగిరిరావు, కోశాధికారి ప్రసాదరావు, బుజ్జి బాబు నాయుడు, సుబ్రమణ్యం, బండి మధుసూదన రెడ్డి, గుల్జార్, అనసూయమ్మ, శమంతకమణి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న విజయేంద్ర సరస్వతితో స్థానిక నాయకులు

గంగమ్మ ఆలయంలో వేలం పాట

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానంలో ఏడాది కాల పరిమితితో వస్త్రాలు, కొబ్బరి చిప్పలు, దుత్తలు, కోళ్లు, పాదరక్షల సేకరణ, భద్రపరిచే రుసుం వసూలు చేయడానికి వేలంపాట చేపట్టారు. వస్త్రాలకు రూ.26 లక్షలకు బి.రవికుమార్, కొబ్బరి చిప్పలకు రూ.6 లక్షల 5 వేలకు టి.ఉదయ్‌కుమార్ పాడుకున్నారు. దుత్తలు, కోళ్లు, పాదరక్షల సేకరణ, భద్రపరుచుకునే రుసుం కోసం ఎవరూ వేలం పాడలేదు. దీంతో వాటిని వాయిదా వేశారు. వేలం పాటను ఆలయ ఛైర్మన్ మహేష్‌యాదవ్, ఈవో జయకుమార్ పర్యవేక్షించారు.

మనకాలపు వాగ్గేయకారుడు అందెశ్రీ

పలువురి సంతాపం



అందెశ్రీతో పేటశ్రీ (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొప్ప వాగ్గేయ కారుడిని తెలుగు సమాజం కోల్పోయిందని అందెశ్రీ మృతి పట్ల జిల్లాకు చెందిన పలువురు సాహిత్య, కళాకారులు విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతి తీరని లోటు అంటూ సంతాపాలను ప్రకటించారు. అందెశ్రీ మృతి పట్ల తిరుపతి జిల్లా రచయితల సంఘం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. అందెశ్రీ పాట తెలుగు వారి నోట నిరంతరము ప్రతిధ్వనిస్తుందని తిరసం గౌరవాధ్యక్షుడు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 'మాయమై పోతున్నడమ్మా మనిషన్న వాడు' అనే పాటలో నేటి ప్రపంచీకరణ చేసిన మానవ విధ్వంసాన్ని అందెశ్రీ ఆవిష్కరించాడని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య అన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు ప్రజానాట్య మండలి పక్షాన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఇటీవలే హైదరాబాదులో బిరుదురాజు రామరాజు శత జయంతి సభలో అందెశ్రీని తాను కలిసినట్టు పేటశ్రీ గుర్తు చేసుకున్నారు. అందెశ్రీ పాటలు ప్రజల మనసులో చిరకాలం ఉంటాయని అన్నారు.

అందెశ్రీ మరణం తీరనిలోటు

తిరుపతి (ఆటోనగర్), నవంబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, నేటి కాలపు వాగ్గేయకారుడు అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.పెంచలయ్య పేర్కొన్నారు. ఆయన రాసిన పాటలు నేటి ప్రపంచీకరణ విధానాలకు చాలా దగ్గరగా ఉన్నాయని తెలిపారు.

ముగ్గురికి డాక్టరేట్ల ప్రదానం



శ్రావణసంధ్య- ఆశాజ్యోతి - శ్రీతేజ నందనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వివిధ యూనివర్సిటీల నుంచి ముగ్గురు పరిశోధకులు డాక్టరేట్లు పొందారు. ● పద్మావతి మహిళా విశ్వావిద్యాలయం బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం పరిశోధకురాలు ఎస్.బి.శ్రావణ సంధ్య డాక్టరేట్ పొందారు. ఏ స్టడీ ఆన్ ట్రైబల్ ఉమెన్ పెరసెప్షన్స్ ఆన్ అనిమియా అండ్ న్యూట్రిషనల్ ప్రాక్టీసస్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అంశంపై ఆచార్య టి.శోభారాణి మార్గదర్శకత్వంతో పరిశోధన పూర్తి చేశారు. ● ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ పరిశోధకురాలు ఆశాజ్యోతి 'స్టడీ ఆఫ్ స్ట్రక్చరల్, ఎలక్ట్రికల్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాపర్టీస్ ఆఫ్ ఇన్ పి-బేస్డ్ మెటల్- ఇంటర్లేయర్ -సెమికోనేక్టర్ స్కోట్కీ జంక్షన్స్ ఫర్ మైక్రో ఎలక్ట్రానిక్ డివైజ్ అంశంపై పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ రాజమాణిక్యం తెలిపారు. ● సంస్కృత వర్సిటీ వ్యాకరణ విభాగ పరిశోధ కురాలు శ్రీతేజ నందనం 'వ్యాకరణ శాస్త్రంలో హిందీ- ఆంగ్లం- తెలుగు భాషలలో ప్రయోగించిన శబ్దాలకు సంస్కృత భాష ధాతు మూలకత్వ దృష్ట్యా విశిష్టమధ్యయనం' అంశంలో డాక్టర్ యశస్వి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

కళత్తూరులో యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు

ఎట్టకేలకు ఇళ్లలో బురద తొలగింపు - మిగిలింది రోడ్లు, కాలువలే





కళత్తూరు దళితవాడలో బురదను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు - ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం ఓళ్లూరు చెరువుకు గండి పడటంతో వచ్చిన వరదనీటి ప్రవాహంతో కళత్తూరు హరిజనవాడతో పాటు రెండు గ్రామాలు బురదమయంగా మారాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు..యుద్ధ ప్రతిపాదికన సహాయక చర్యలు చేపడుతున్నారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి సుశీలాదేవి గ్రామంలోనే ఉంటూ పారిశుధ్య పనులను వేగవంతం చేశారు. రోజుకు 300 మంది కార్మికులు కళత్తూరు హరిజనవాడలో పారిశుధ్య పనులు చేపట్టారు. 450 గడపల్లో చేరిన బురదను సోమవారం సాయంత్రానికి తొలగించారు. ఇక వీధుల్లో, డ్రైనేజీ కాలువల్లో పేరుకున్న మట్టిని రెండు రోజుల్లో తొలగిస్తామని సుశీలాదేవి తెలిపారు. డీపీవోను, వివిధ శాఖల అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు.







సాంకేతిక విజ్ఞానంతో పరిశోధనల్లో ప్రగతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని సరైన విధానంలో సద్వినియోగం చేసుకోవడం ద్వారా పరిశోధన రంగంలో ప్రగతిని సాధించవచ్చని ఏపీ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగం- ముంబయిలోని వెస్టర్న్ రీజనల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్ - యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ - జాతీయ పరికరాల సౌకర్య కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ కోసం ల్యాబొరేటరీ పరికరాల ఆపరేషన్, మెయింటెనెన్స్‌పై వారం పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం డిసెంబరు 15 నుంచి 19 వరకూ శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగంలో జరుగనుంది. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ విజయభాస్కరరావుతో కలిసి ఛైర్మన్ మధుమూర్తి సోమవారం మంగళగిరిలోని మండలి కార్యాలయంలో విడుదల చేసి మాట్లాడారు. ఈ తరహా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఉన్నత విద్యా రంగంలో సాంకేతిక ప్రావీణ్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో కోట్ల రూపాయల విలువ చేసే పరిశోధన పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు, సాంకేతిక సిబ్బందికి పరికరాల ఆపరేషన్, కాలిబ్రేషన్, నిర్వహణ, మరమ్మతులపై సమగ్ర శిక్షణ లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య దేవప్రసాద్ రాజు పాల్గొన్నారు.

ఓఆర్ఐకి చేరిన రెండు తాళపత్ర గ్రంథాలు




ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లుకు తాళపత్రాలను అందజేస్తున్న రాఘవేంద్రరావు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఉద్యోగి రాఘవేంద్రరావు రెండు తాళపత్ర గ్రంథాలను రూపొందించారు. వీటిని ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లుకు సోమవారం అందజేశారు. గౌతమి సంహిత అనే జైమిని మహర్షి జ్యోతిష్యానికి వేలూరి సుబ్రమణ్యశాస్త్రి రాసిన వ్యాఖ్యను తాళపత్ర గ్రంథ రూపంలో తెచ్చారు. సింగారాచార్య రాసిన జాతకరాజీయము గ్రంథానికి కొంపెల్ల నరసింహశాస్త్రి చేసిన తెలుగు వ్యాఖ్యానానికి తాళపత్ర గ్రంథ రూపమిచ్చారు. ఈ గ్రంథాన్ని రాఘవేంద్రరావు ఆంగ్లంలోకి అనువదించి ఓఆర్ఐకి అందజేశారు.

రాష్ట్రపతి పర్యటనలో అప్రమత్తంగా ఉండండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 20, 21 తేదీల్లో తిరుపతికి రానున్న క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ సుబ్బరాయుడితో ఆయన సమీక్షించారు. 20వ తేది మధ్యాహ్నం 3.30గంటలకు విమానాశ్రయానికి చేరుకుని, రోడ్డు మార్గాన తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని తిరుమల వెళతారన్నారు. 21న ఉదయం 9.30గంటలకు వరాహస్వామిని, అనంతరం శ్రీవారిని దర్శించుకుని 10.55 గంటలకు తిరుగు ప్రయాణమవుతారన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్వో నరసింహులు, ఏఎస్పీ రవి మనోహరాచారి, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

సర్వ దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.75 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,217

తలనీలాలు సమర్పించినవారు: 25 వేలు





స్పిరిచ్యువల్ స్ట్రీట్ నమూనా డిజైన్స్

ఇస్కాన్ సమీపంలోనే

స్పిరిచ్యువల్ స్ట్రీట్

స్థల పరిశీలన

త్వరలోనే డిజైన్‌కు తుదిరూపు

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆధ్యాత్మిక వీధి (స్పిరిచ్యువల్ స్ట్రీట్) ఏర్పాటు దిశగా మరో అడుగు పడింది. అడుగులు పడుతున్నాయి. ఆర్కిటెక్చర్ డిజైన్ సంస్థ 'పీఎక్స్ మేక్స్' ప్రతినిధులు నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యకు అధికారులకు దీనిపై మూడు రోజుల కిందట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తొలుత ఇస్కాన్ ఎదురు (కంచిమఠం)గా ఉన్న రోడ్డును స్పిరిచ్యువల్ స్ట్రీట్‌గా డిజైన్ చేసి చూపించారు. అక్కడ నివాసాలకు ఇబ్బంది వస్తుందని భావించి మరో రోడ్డును ఎంపిక చేయాలని పీఎక్స్ మేక్స్ ప్రతినిధులకు అధికారులు సూచించడంతో మున్సిపల్ ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల బృందం అనేక రోడ్లను పరిశీలించింది. ఇస్కాన్ రోడ్డులోని కేంద్రీయ విద్యా భవన్ పక్కన మాస్టర్ ప్లాన్ రోడ్డు అన్ని విధాలుగా ఆమోదయోగ్యంగా ఉంటుందని బృందం అభిప్రాయపడింది. అలిపిరి లింక్ బస్టాండుకు ఎదురుగా, ఇస్కాన్ మందిరానికి పక్కనగల రోడ్డులో స్పిరిచ్యువల్ స్ట్రీట్ ఏర్పాటు చేయడం వలన భక్తుల సందర్శనకు అనువుగా ఉంటుందనే అభిప్రాయానికి వచ్చారు. ఆ మేరకు డిజైన్స్ మార్చాలని పీఎక్స్ మేక్స్ ప్రతినిధులకు కమిషనర్ సూచించారు.

వంద షాపులు

ఆధ్యాత్మిక వీధి ప్రారంభంలో ఆర్చిని ఏర్పాటు చేయనున్నారు. భజనలు, వేదమంత్రాలు, నాదస్వర ధ్వనులు, భక్తిపాటలను వినిపించేలా ప్లాన్ రూపొందిస్తున్నారు. తులసి మాలలు మొదలుకుని ధూపదీపాలు, పుస్తకాలు, ఆధ్యాత్మిక కళాఖండాలు అమ్మే షాపులతో పాటు భక్తులకు ప్రసాదాలు, ఆయుర్వేద వస్తువులు, దేవతామూర్తుల చిత్రపటాలు, హస్తకళా వస్తువులు పూజా సామగ్రి.. ఇక్కడ లభిస్తాయి. దాదాపు 100కి పైగా దుకాణాలు ఉండేలా డిజైన్ చేస్తున్నారు.

ప్రమేయం లేని చోరీ కేసుల్లో తన పేరు ప్రస్తావిస్తున్నాడనే హత్య



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

రేణిగుంట నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తన ప్రమేయం లేని చోరీ కేసుల్లో పోలీసులు వద్ద తన పేరు ప్రస్తావిస్తున్నాడనే కోపంతో మనోజ్‌ను హత్య చేశానని హరిప్రసాద్ విచారణలో చెప్పినట్టు అదనపు ఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. సోమవారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ వివవరాలు వెల్లడించారు. ఈనెల 2న ఆదివారం మద్యం దుకాణం సమీపంలో జరిగిన హత్య కేసులో వేలిముద్రలఆధారంగా మృతుడిని మనోజ్‌గా గుర్తించామన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టామన్నారు. రేణిగుంటలో నివాసం ఉంటున్న మనోజ్, హరిప్రసాద్ కలసి చోరీలు చేసేవారని, ఈ క్రమంలో వారు జైలు శిక్షకు అనుభవించారన్నారు. ఆ తర్వాత హరిప్రసాద్ పెయింటింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. అయితే కొన్ని చోరీ కేసుల్లో ప్రమేయం లేకున్నా మనోజ్ పోలీసులు వద్ద తన పేరు చెబుతుండడంతో హరిప్రసాద్ పగ పెంచుకున్నాడన్నారు. అలాగే ఇటీవల హరిప్రసాద్ కాళ్లకు గాయమై నడవలేని స్థితికి చేరుకున్నాడన్నారు. దీనిపై హరిప్రసాద్‌సహా అతని భార్యపై మనోజ్ తప్పుడువ్యాఖ్యలు చేశాడన్నారు. దీంతో మరింత పగ పెంచుకున్న హరిప్రసాద్ ఎలాగైనా మనోజ్‌ను అంతమొందించాలనుకున్నాడని చెప్పారు. తన తమ్ముడు, నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన సుధాకర్, రేణిగుంట పాంచాలినగర్‌కు చెందిన మిత్రుడు శ్యాంసన్‌తో కలిసి పథకం ప్రకారం ప్లాస్టిక్ పట్టలు, తాళ్లు, టేప్ కొనుగోలు చేశారన్నారు. పెయింటింగ్ కాంట్రాక్ట్ కుదిరిందంటూ నవంబర్ 2వ తేదీ ఆదివారం ఉదయం లక్ష్మీనగర్ వద్ద ఉన్న తన ఇంటికి రావాలని మనోజ్‌ను పిలిచాడన్నారు. ఇంట్లోకి వచ్చిన మనోజ్ కాళ్లచేతులు కట్టి నోటికి, ముక్కుకు స్టిక్కర్ అంటించి ఊపిరి ఆడనీయకుండా చంపి వేశారన్నారు. అనంతరం మనోజ్ మృతదేహాన్ని అసంపూర్ణ భవనంలోని సంపులో వేసి వెళ్లిపోయారన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం కట్ట పుట్టాలమ్మ ఆలయం వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు విషయాలను వెల్లడించారన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన సీఐలు మంజునాథ్, జయచంద్ర, ఎస్ఐ సుధాకర్, ట్రైనీ ఎస్ఐ ప్రవల్లిక, కానిస్టేబుళ్లకు ఎస్పీ రివార్డులను అందించారు.

సమస్యలుంటే అధికారుల దృష్టికి తెండి

ఆత్మహత్య పేరుతో బెదిరిస్తే మంచి పద్ధతికాదు ● అర్జీదారులకు క్లాస్ తీసుకున్న కలెక్టర్ ● పీజీఆర్ఎస్‌కు 266 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురండి. అంతే తప్ప పెట్రోల్‌క్యాన్ తీసుకొచ్చి ఆత్మహత్య చేసుకుంటామంటూ బెదిరింపులకు దిగడ మంచిపద్ధతి కాదు' అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఇటీవల కొందరు తమ సమస్యలు పరిష్కరించాలంటూ పెట్రోల్, డీజల్‌వెంట తీసుకొచ్చి కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యకు య్నిస్తామని బెదిరించడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో సోమవారం కూడా ఓకుటుంబం కలెక్టరేట్ వద్ద హల్‌చల్ చేసింది. తొట్టంబేడు మండలం శ్రీకృష్ణాపురానికి చెందిన వీరాస్వామి దంపతులు, అతడి కుమారుడు క్యాన్ నిండా పెట్రోల్ తీసుకువచ్చారు. 'శ్రీకృష్ణాపురంలో మేము 40 ఏళ్లుగా ఐదు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాం. డీకేటీ పట్టా కూడా ఉంది. బంధువులు వచ్చి మా పేరుతో ఉన్నాయని దౌర్జన్యంగా పొలం దున్నుతున్నారు. దీనిపై మేము కోర్టుకు వెళ్లాం. కోర్టులో కేసు ఉండగా వారు పొలంలోకి వస్తున్నారు' అంటూ తన భార్య అమరావతితో కలిసి వీరాస్వామి నిరసన తెలిపారు. పెట్రోల్ క్యాన్‌తో వీరు రావడాన్ని గుర్తించిన పోలీసులు కలెక్టర్ వద్దకు తీసుకువచ్చారు. దీంతో కలెక్టర్ వెంకటేశ్వర్ అర్జీదారులను సున్నితంగా మందలించారు. 'మీ సమస్య కోర్టు పరిధిలో ఉంది. అయినా మీరు అర్జీ ఇచ్చినపుడు రెండుమూడుసార్లు రెవెన్యూ అధికారులు వచ్చారు. అయితే మీరు మొండిగా పెట్రోల్‌పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించడం సరికాదు. ప్రతి ఒక్కరూ ఇలా బెదిరింపులకు దిగితే ఎలా? ఇలాంటి సంస్కృతిని సహించేది లేదు' అంటూ మందలించారు. తిరుచానూరు ఎస్ఐ అరుణ వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. పీజీఆర్ఎస్‌కు 266 అర్జీలు అందాయి. అందులో భూసమస్యలపైనే 169 ఉన్నాయి.





అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ - కుటుంబ సభ్యులతో వీరాస్వామి

సమస్యకు పరిష్కారం దొరికింది



నేను గతంలో ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశా. ఇప్పటి సీఎం చంద్రబాబుకు పాఠాలు ఆనాడు పాఠాలు చెప్పా. ఇటీవల నారావారిపల్లెకు వచ్చినపుడు నా సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లా. దీనిపై కలెక్టర్‌ను కలవడానికి వచ్చాను. చాలా చక్కగా పలకరించారు. మరో వారం రోజుల్లో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సహాయం అందుతుందని తెలిపారు.

- కృష్ణమూర్తి, బైరాగిపట్టెడ

పింఛను ఇచ్చి ఆదుకోండి



ప్రసూతి సమయంలో అనారోగ్య సమస్యలు తలెత్తాయి. నడవలేని స్థితికి చేరుకున్నాను. వీల్‌చైర్ ఉంటే తప్ప బయట ప్రపంచాన్ని చూడలేను. మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నా. పింఛను ఇచ్చి ఆదుకోండి.

- సాలమ్మ, కోటమంగాపురం, కేవీబీపురం మండలం

మూడుచక్రాల స్కూటర్ ఇవ్వండి



వంటమాస్టర్‌గా పనిచేస్తున్న కుటుంబాన్ని పోషించేవాడిని రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాను. దీంతో నడిచే పరిస్థితి లేదు. ప్రభుత్వంపింఛను ఇస్తోంది. కుటుంబ ఆర్థిక అవసరాలకు సరిపోవడం లేదు. దివ్యాంగులకు ఇచ్చే మూడు చక్రాల స్కూటర్‌ను ప్రభుత్వం అందజేస్తే యధావిధిగా వంట మాస్టర్ పనికి వెళతాను. దీంతో కుటుంబాన్ని పోషించుకుంటా.

- జయశంకర్, మదనంబేడు, సత్యవేడు

‘తోతాపురి’కి మద్దతు ధర చెల్లించండి

● మామిడి గుజ్జు పరిశ్రమ ఎదుట రైతుల ధర్నా



పాకాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కాయలకు గుజ్జు పరిశ్రమ యజమానులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే తక్కువ చెల్లిస్తున్నారంటూ రైతులు ఆందోళనకు దిగారు. పాకాల మండలం రామిరెడ్డిగారిఇండ్లు సమీపంలోని సుప్రీం క్వాలిటీ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుజ్జుపరిశ్రమ ఎదుట సోమవారం మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులతో కలిసి రైతులు ధర్నా చేపట్టారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కిలోకు రూ.8 చెల్లించకుండా రూ.3.70, రూ.3.90 చొప్పున ఇవ్వడం దారుణమన్నారు. కనీసం కోతకూలీ, రవాణా ఖర్చులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో మద్దతు ధర చెల్లించకుండా ఇప్పుడు కిలోకు రూ.4లోపు చెల్లించడం తగదన్నారు. నన్నూరివారిపల్లె నుంచి గుజ్జు పరిశ్రమవరకు ర్యాలీ నిర్వహించి ఫ్యాక్టరీ మేనేజర్ బాలాజీ నాయుడికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కిలోకు రూ.4 చొప్పున రాయితీ నగదు చెల్లించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరిబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి ఆనందనాయుడు, ఉపాధ్యక్షుడు లవకుమార్ రెడ్డి, కోశాధికారి చంద్రమౌళి, రైతులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదులు

పరిష్కరించకుంటే చర్యలు

● అర్జీదారులు మళ్లీ మళ్లీ వస్తే అధికారులను ఉపేక్షించనన్న ఎస్పీ



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదుదారుల్లేక బోసిపోతున్న కౌంటర్లు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసు పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించకుంటే చర్యలు తప్పవని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి 70 మంది హాజరై తమ బాధలను అధికారుల ఎదుట మొర పెట్టుకున్నారు. వీటిలో దాదాపు 40 శాతం ఫిర్యాదులను ఇక్కడే పరిష్కరించారు. గతంతో పోలిస్తే ఈసారి అర్జీదారుల సంఖ్య తగ్గింది. దీతో అదనపు ఎస్పీలు, సీఐల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లు బోసిపోయాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులే మళ్లీ మళ్లీ వచ్చి ఇబ్బంది పడుతుంటే.. సంబంధిత అధికారులను ఉపేక్షించేది లేదని ఇటీవల ఎస్పీ హెచ్చరించారు. దీంతో రెండు, మూడు వారాలుగా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు చొరవ చూపడంతో.. అర్జీదారులు తగ్గారని పోలీసు వర్గాలు చెప్పాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, రామకృష్ణ, సీఐలు పాల్గొన్నారు.



మురళీమోహన్ అలియాస్ చిన్నబాబు.. శ్రీపతిబాబు .. ఎస్వీఎం శ్రీధర్.. పెరుమాళ్ మధు.. తోట వాసు.. బీడీ బాలాజీ

6 కార్పొరేషన్లకు 12 మంది డైరెక్టర్లు

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 10 కార్పొరేషన్లకు సంబంధించి బోర్డు డైరెక్టర్లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. వీటిలో తిరుపతి జిల్లాకు సంబంధించి వివిధ కార్పొరేషన్లకుగాను 12మంది కూటమి నాయకులకు అవకాశం కల్పించింది. వీరిలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా మురళీమోహన్ అలియాస్ చినబాబు (చంద్రగిరి-టీడీపీ), లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్‌గా ఆర్. మహేశ్వరి (చంద్రగిరి-టీడీపీ), కాపు వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా టీడీ వరప్రసాద్ (తిరుపతి-బీజేపీ), తోట వాసుదేవ (తిరుపతి-టీడీపీ), ఎస్సీ కమిషన్ సభ్యుడిగా శ్రీపతి బాబు (సూళ్లూరుపేట-టీడీపీ), దాసరి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కోల లోకయ్య (సత్యవేడు-టీడీపీ), ప్రేమ్ కుమార్ (తిరుపతి-బీజేపీ), మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎస్వీఎం శ్రీధర్ (తిరుపతి-టీడీపీ), పెరుమాళ్ మధు (తిరుపతి-టీడీపీ), బీడి బాలాజీ (సత్యవేడు-బీజేపీ), కె.నమశివాయం (సత్యవేడు-టీడీపీ), ఎస్.శరవణ (చంద్రగిరి- టీడీపీ) ఉన్నారు.



ఎన్.ఎన్.ధనపాల్ .. ఎస్.శరవణ.. ఎన్.భాస్కరన్.. కే.నమశ్శివాయం.. కోలా లోకయ్య.. టి.డి.వరప్రసాద్

పేద కుటుంబాలను దత్తత తీసుకుంటా



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4లో భాగంగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటానని ఎన్నారై సుబ్రహ్మణ్యంరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గతంలో తన స్నేహితుడు మహ్మద్ ఆరీఫ్ కడపలో ఓ బంగారు కుటుంబానికి మార్గదర్శిగా మారారని, ఈ విషయం తెలిసి తానూ దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చినట్లు చెప్పారు. ఈయన నిర్ణయాన్ని కలెక్టర్ అభినందించారు.

మానసిక రోగులకోసం ‘మనోబంధు’

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మానసిక రోగులను ఆదుకునేలా ప్రభుత్వం 'మనోబంధు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. రోడ్లపై తిరుగుతున్న మానసిక రోగులను గుర్తించి కడపలో పునరావాస కేంద్రానికి తరలించి చికిత్సలు అందించి తిరిగి వారిని సమాజంలోకి చేర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రథీత్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

జిల్లాలో కుష్ఠువ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించేందుకు ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు లెప్రసీ క్రాస్ డిటెక్షన్ క్యాంపెయిన్ ద్వారా వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుష్ఠు లక్షణాలున్న వారిని గుర్తిస్తారు. వైద్య చికిత్స అందిస్తారు. దీనికి సంబంధించి పోస్టర్లను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ప్రాథమిక దశలోనే కుష్ఠు లక్షణాలను గుర్తిస్తే నివారించవచ్చని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ, డీఐవో శాంతకుమారి, అధికారులు పాల్గొన్నారు.

నిమోనియా నివారణకు అవగాహన అవసరం

నిమోనియా నివారణకు సామాజిక అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సోషల్ అండ్ యాక్షన్ న్యూట్రలైజ్ నిమోనియా సక్సెస్‌ఫులీ(ఎస్ఏఏఎన్ఎస్) బ్యానర్లు, పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. బుధవారం నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఎస్ఏఏఎన్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా ఇమ్యునిజేషన్ అధికారి శాంతకుమారి, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలు

ధర్మకర్తలమండలి సమావేశంలో పలు అంశాలపై చర్చ

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను గతం కన్నా మరింత వైభవోపేతంగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. ఇటీవల ఆలయ నూతన ధర్మకర్తలమండలి కొలువుదీరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం జరిగిన తొలి మండలి సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... వచ్చే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు జాతీయస్థాయిలో కీలక నేతలు, అధికారులతో పాటు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తామన్నారు. మాస్టర్‌ప్లాన్ అభివృద్ధి, ఆలయం నుంచి లోబావి వరకు రోడ్డు, ఇక భక్తులకు నగదు రహిత ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంపై కసరత్తు చేశామన్నారు. ఇక ముక్కంటి ఆలయ పారిశుధ్య నిర్వహణ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఆలయంలో సెంట్రల్ ఏసీ సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లలకు పాలు పంపిణీ చేయడం, భక్తులకు స్వామివారి సన్నిధిలో విబూధి, అమ్మవారిసన్నిధిలో కుంకుమను ప్రసాదంగా ఇచ్చే అంశంపై దాతలతో చర్చిస్తామన్నారు. అనంతరం ఛైర్మన్ సాయిప్రసాద్ మాట్లాడుతూ... తొలి ధర్మకర్తలమండలి సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్ మంచి సూచనలు చేశారన్నారు. అలాగే ఈవోతో మండలి సమన్వయం చేసుకుని సామాన్య భక్తులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా అభివృద్ధిపథంలో నడుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, సభ్యులు వాకిచర్ల గుర్రప్పశెట్టి తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరు వార్తలు

మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ధనపాల్‌కు సన్మానం


ధనపాల్‌ను సత్కరిస్తున్న గంజిమాధవయ్య తదితరులు

పుత్తూరు అర్బన్, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మొదిలియార్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎస్.ఎస్.ధనపాల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవి కేటాయింపుతో పార్టీ విధేయతకు అవకాశం లభించినట్లైంది. పుత్తూరు పట్టణ పరిధిలో మొదిలియార్‌ల జనాభా అధిక సంఖ్యలో ఉంది. పార్టీ పుత్తూరు పట్టణ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఎస్.ఎస్.ధనపాల్‌ను ఎమ్మెల్యే ప్రతిపాదనతో మొదిలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. తనపై నమ్మకం వుంచి రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ స్థానానికి ప్రతిపాదించిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ధనపాల్‌ను పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య సత్కరించారు. పుత్తూరు మండల టీడీపీ అధ్యక్షుడు అరవ బాలాజీ, తడుకు సింగిల్ విండో ఛైర్మన్ కరుణాయాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాబునాయుడు, ఐ-టీడీపీ కో ఆర్డినేటర్ ఈశ్వర్ యాదవ్, రూరల్ ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్‌లు ధనపాల్‌ను సత్కరించిన వారిలో ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అకౌంటింగ్ దినం

పుత్తూరు అర్బన్, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఆర్థిక సంస్థకు అకౌంటింగ్ అత్యంత ప్రధానమైనదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. సోమవారం కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అకౌంటింగ్ దినాన్ని ఘనంగా నిర్వహించారు. సమాజానికి అకౌంటెంట్లు, ఆర్థిక వృత్తి నిపుణులు ఎనలేని సేవ చేస్తున్నారని కొనియాడారు. వీరు విధులను పారదర్శకంగా, నిబద్ధతగా నిర్వహిస్తే దేశ ఆర్థిక అభివద్ధికి తోడ్పడుతుందన్నారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి రూ.2.50 లక్షల విరాళం



పుత్తూరు అర్బన్, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయ అన్నదాన సత్రానికి విశ్రాంత కమర్షియల్ ట్యాక్స్ అదనపు కమిషనర్ వెంకట సుబ్బన్న రూ.2.50 లక్షల విరాళాన్ని అందజేశారు. సోమవారం నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అంతకుముందు ఆలయ నిర్వాహకులు దాత, కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు ఘనంగా సత్కరించారు. కార్యనిర్వాహక సభ్యులు కృష్ణయ్య, వెంకటేశ్వరెడ్డి, కమిటీ సభ్యులు గోపి రాయల్, బిల్డింగ్ కాంట్రాక్టర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక సోమవారం పూజలు


ప్రత్యేక అలంకరణలో సదాశివుడు

వడమాలపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు శివాలయాల్లో కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీ శంకర ఆలయంలో వేకువ జామున మహాలింగానికి పంచామృతాభి షేకం నిర్వహించి పట్టుపీతాంబరాలు, పూలమా లలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సదాశివకోనలో పలు ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు జలపాతంలో స్నానాలు సదాశివుడిని దర్శించుకున్నారు. అప్పలాయగుంట చంద్రమౌళీశ్వర స్వామి, వడమాలపేటలోని గౌరీశంకర ఆలయాల్లో మహాశివుడికి ప్రత్యేక పూజలు జరిగాయి.

దాడికి నిరసనగా విధుల బహిష్కరణ


విధులను బహిష్కరించి నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

పుత్తూరు అర్బన్, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): పుత్తూరు కోర్టు ఆవరణలో న్యాయవాది రాజశేఖర్‌పై జరిగిన దాడికి నిరసనగా తిరుపతి బార్ అసోసియేషన్ పిలుపు మేరకు పుత్తూరు న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. పుత్తూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. పుత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాలి సురేష్, ప్రధాన కార్యదర్శి రాజేష్, సభ్యులు శివప్రసాద్, శివకుమార్, శేషాచలం, రామచంద్రారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు: డీఎస్పీ

పుత్తూరు కోర్టు ఆవరణలో న్యాయవాది రాజశేఖర్‌పై దాడికి యత్నించిన సాయిప్రసాద్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. సాయిప్రసాద్ రెడ్డి ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కోర్టు ఆవరణలో తన కారుతో రాజశేఖర్‌ను ఢీ కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. న్యాయవాది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సాయిప్రసాద్‌రెడ్డిని అరెస్టు చేసి కారును సీజ్ చేశామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు వివరించారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): అడ్వకేట్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేయాలంటూ సోమవారం సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పలువురు మాట్లాడుతూ పుత్తూరు కోర్టు ఆవరణలో అడ్వకేట్ రాజశేఖర్‌పై సాయిప్రసాద్ దాడికి పాల్పడినట్లు తెలిపారు. న్యాయవాదులు వెంకటేశులు, గోపీనాథ్, శ్రావణ్, వెంకటేష్, జానయ్య, వేలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక, ఆధ్యాత్మిక సేవలో తరించండి

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆధ్యాత్మిక సేవలో స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొనాలని ఈవో బాపిరెడ్డి కోరారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఫౌండేషన్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా జిల్లా రోవర్ కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు, జిల్లా ట్రైనింగ్ కమిషనర్, వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాయ కార్యనిర్వాహక కమిషనర్ కోటేశ్వరరావు సోమవారం ఈవో బాపిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఫౌండేషన్ స్టిక్కర్లు, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 30 సంవత్సరాలుగా మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. స్కౌట్ మాస్టర్లు మహేంద్ర, అజారుద్దీన్, విద్యాసాగర్, మణికంఠ, సుబ్రహ్మణ్యం, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్పీకర్ అందజేత

కేవీబీపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేవీబీపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు కూనాటి సురేష్ బ్యాటరీతో పనిచేసే అధునాతన స్పీకర్, రెండు మైకులను సోమవారం అందజేశారు. విద్యార్థులకు, పాఠశాలకు అవసరమైన సామగ్రిని దాతలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయభాస్కర్, ప్రకాష్, విజయ, వసుంధర, గాయత్రి, నాగరాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రేపు రాచపాళెంలో ఉచిత వైద్య శిబిరం

ఓజిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రాచపాళెంలో ఈనెల 12న నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్ తెలిపారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్న వైద్య శిబిరంలో కంటి, ఎముకలు, కీళ్లు, చెవి, ముక్కు, గొంతు వ్యాధి నిపుణులు పాల్గొంటారని తెలిపారు.

వైభవంగా లక్ష దీపోత్సవం



సూళ్లూరుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. కన్యకాపరమేశ్వరి వలంటరీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన లక్ష దీపోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా గణపతి హోమం, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. శివ, పార్వతుల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి కల్యాణం నిర్వహించారు. భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి వలంటరీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కాకి శ్రీరామ్మూర్తి, కిషోర్, సభ్యులు పాల్గొన్నారు.

పులికాట్‌లో తెగిన విద్యుత్ లైన్


పులికాట్‌లో మరమ్మతులు చేపడుతున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

సూళ్లూరుపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు సబ్‌స్టేషన్ నుంచి శ్రీహరికోటకు వెళ్లే 33/11 కేవీ విద్యుత్ లైన్ పులికాట్ సరస్సులో సోమవారం తెగిపోవడంతో గంటపాటు సరఫరాలకు అంతరాయం కలిగింది. కుదిరి - అట్టకాని తిప్ప మధ్య పులికాట్‌లో విద్యుత్ లైన్ తెగిపోయిన విషయం తెలుసుకున్న ఏడీఈ శేఖర్, ఏఈ జగదీస్ సిబ్బందితో అక్కడకు చేరుకుని వెంటనే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు.

విద్యార్థినులకు అభినందన


విద్యార్థినులకు సర్టిఫికెట్స్, మెమెంటోలు అందించి అభినందిస్తున్న హెచ్‌ఎం మరుద్వతి, ఉపాధ్యాయినులు

చిల్లకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులను హెచ్‌ఎం మరుద్వతి, ఒకేషనల్ ట్రైనర్ చాందిని, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన ఒకేషనల్ విభాగంలో తిరుపతిలో నిర్వహించిన జిల్లాస్థాయి స్కౌట్స్ అండ్ గైడ్స్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు సమీరాబేగం, భూమిక ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ విభాగంలో వైర్‌లెస్ ఎలక్ట్రికల్ వెహికల్ చార్జింగ్ ప్రాజెక్టును ప్రదర్శించి జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో కామాక్షమ్మ పాల్గొన్నారు.

కార్తీక సోమవార పూజలు


శివాలయంలో కార్తీక దీపాలను వెలగిస్తున్న భక్తులు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మూడో సోమవారం సందర్భంగా పట్టణంలోని పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయం, వీరభద్రస్వామి, సోమ సుందేశ్వర స్వామి ఆలయాలలో భక్తులు కార్తీక దీపాలను వెలగించి స్వామి వారిని దర్శించుకున్నారు.

దివ్యాంగుడి అదృశ్యం


ఏలిషా (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలిచెర్ల గ్రామానికి చెందిన ఏలిషా కనిపించడంలేదని అతని భార్య మస్తానమ్మ సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలిషా దివ్యాంగ పింఛన్ వెరిఫికేషన్ కోసం ఈనెల 6వ తేదీన తిరుపతి రూయా ఆస్పత్రికి వెళ్లాడని, తిరిగి రాకపోవడంతో తిరుపతి పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదన్నారు.

వరి విత్తనాల శ్యాంపిల్స్ సేకరణ

కోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంతో పాటు విద్యానగర్‌లోని ఎరువుల దుకాణాల్లో సోమవారం వ్యవసాయశాఖ అధికారులు వరి విత్తనాల శ్యాంపిల్స్ సేకరించారు. వరి వంగడాలు సామర్థ్యం, అసలైనవేనా లేక నకిలీ విత్తనాలా అనే విషయం తేల్చేందుకు ఏవో సుచేంద్రప్రసాద్, ఎరువుల దుకాణాల్లో బీపీటీ 5204, నెల్లూరు జిలకర్ర, 1010 రకం వరి విత్తనాలను శ్యాంపిల్స్ సేకరించారు.

మొక్కుబడిగా మండల సమావేశం

వాకాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాకాడులోని స్త్రీశక్తి భవనంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొడవలూరు అనసూయమ్మ ఆధ్వర్యంలో మొక్కుబడిగా జరిగింది. పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. జడ్పీటీసీ రౌతు రామకృష్ణ ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న అవకతవకలపై ఏపీవోను నిలదీశారు. పలు గ్రామాలకు తాగునీరు సరఫరా జరగడంలేదని కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నెలిపూడి, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా సరిగా లేదని సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. సమావేశంలో ఏఎంసీ ఛైర్ పర్సన్ మర్రి ప్రమీల, తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరం


తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి

నాయుడుపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలూ ఎంతో అవసరమని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. నాయుడుపేటలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం రాత్రి జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అఖీల్, కోచ్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్‌తో కలిసి డీఎస్పీ ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 100 మంది క్రీడాకారులు తైక్వాండో పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు ఏఎంసీ ఛైర్మన్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనపరచిన క్రీడాకారులు ఈనెల 14, 15 తేదీల్లో కాకినాడలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ పవన్ తెలిపారు.

మూలస్థానేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా బాలకృష్ణమ నాయుడు


బాలకృష్ణమ నాయుడును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన శివాలయమైన మూలస్థానేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు నియమితులయ్యారు. సోమవారం స్థానిక నరసింగరావుపేటలోని బీజేపీ కార్యాలయంలో ఆయనను ఆ పార్టీ నాయకులు సన్మానించారు. బాలకృష్ణమ నాయుడు మాట్లాడుతూ తనకు పదవి సహకరించిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు దయాకర్, బాలకృష్ణ, నిరంజన్, శివకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభయ శంకరుడి ఆలయంలో పూజలు


అభయ శంకరుడి ఆలయంలో పూజలు చేస్తున్న టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ రమేష్

సూళ్లూరుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయం, టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి దీపాలు వెలిగించారు. టీటీడీ మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అభయ శంకరుడి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు కేవీరెడ్డి, బుజ్జయ్య, వెంకటరమణ, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకరణలో కైలాసనాథ స్వామి

వెంకటగిరి టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరహర క్షేత్రంలోని కాత్యాయని సమేత కైలాసనాథ స్వామి ఆలయంలో కార్తీక మూడవ సోమవారం పురష్కరించుకుని స్వామివారిని శాకాంబరిగా అలంకరించారు. అలాగే కాశీ విశ్వనాథస్వామి, రామలింగేశ్వరస్వామి, వల్లివేడు క్రాస్ వద్ద ఉన్న భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

ఓజిలి మండల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో ఉమాదేవి, వేదికపై ఎంపీపీ అరుణమ్మ, ఎంపీడీవో నారాయణరెడ్డి

ఓజిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన సోమవారం జరిగింది. వివిధ శాఖలపై సమీక్షను నిర్వహించారు. విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయం, అంగన్‌వాడీ, పశువైద్యం, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, వెలుగు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, హౌసింగ్ అధికారులు తమ శాఖల పనితీరు, అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ప్రసాద్‌నాయుడు, మీనాక్షి, కుందాం సొసైటీ అధ్యక్షుడు పుషోత్తం రాజు, ఎంపీడీవో నారాయణరెడ్డి, తహసీల్దారు పద్మావతి, సీడీపీవో ఉమాదేవి, ఎంపీటీసీలు శేఖర్, ఏవో వరప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవివర్మ, ఏపీఎం పద్మ, ఏపీవో చిన్నయ్య పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

దక్కిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యూరియా కొరత లేదని ఆల్తూరుపాడు సొసైటీ అధ్యక్షుడు కాసం చైతన్య అన్నారు. సోమవారం సొసైటీ పరిధిలోని రైతులకు మొదటి విడతగా ఎకరాకు ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని తగినంత యూరియా సరఫరా చేస్తోందన్నారు. ప్రతి రైతుకూ ఎకరాకు 3 బస్తాల చొప్పున దశల వారీగా అందచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో శిరీష, అగ్రికల్చర్ అసిస్టెంట్ భవాని, మాజీ ఎంపీటీసీ చంద్రమౌళిరెడ్డి, మాజీ సర్పంచ్ మునిరత్నంరెడ్డి, టీడీపీ నేత శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

సూళ్లూరుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలను రూపంలో వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ

కోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం కోట పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంబరీషా, మంగమ్మ, శ్యామలమ్మ, పరుశురాం సాయి పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ డైరెక్టర్‌గా శ్రీపతిబాబు

తడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ డైరెక్టర్‌గా టీడీపీ నాయకుడు డాక్టర్ శ్రీపతిబాబును ప్రభుత్వం నియమించింది. సోమవారం వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా చిట్టమూరు మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన శ్రీపతిబాబును రాష్ట్ర ఎస్సీ కమిషన్ డైరెక్టర్‌గా నియమించింది. శ్రీపతి బాబు కుటుంబం టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్న శ్రీపతిబాబు గత ఎన్నికల్లో సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించారు. అయితే పార్టీ అధిష్ఠానం రాజకీయ సమీకరణాలతో విజయశ్రీకి టిక్కెట్ కేటాయించింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహించిన వంద రోజుల పండుగకు సత్యవేడు నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా శ్రీపతిబాబును పార్టీ అధిష్ఠానం నియమించింది. తాజాగా ఎస్సీ కమిషన్‌లో చోటు కల్పించారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న బస్సు

ఒకరి మృతి... మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన శివ

నాయుడుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా... మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... పెళ్లకూరు మంలం అర్థమాల గ్రామానికి చెందిన శివ, నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురంలో నివాసం ఉంటున్న శ్రావణిని సోమవారం సాయంత్రం మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఓ పరిశ్రమ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శివ (35) మృతి చెందాడు. శ్రావణి పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం భారతి

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు విభాగాల్లో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం భారతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో అండర్-17 హాకీ విభాగంలో మహిధర్, సంతోష్, వెంకటేశ్వర్లు, కబడ్డీలో జాషువా, అండర్-14 విభాగంలో హాకీ క్రీడలో హరిహరన్, వాలీబాల్ విభాగంలో ప్రణీత్ రాష్ట్రస్థాయి ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగులు ఇబ్బంది పెడుతున్నారు

బ్రాంచ్ మేనేజర్‌కు ఏజెంట్ల ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎల్‌ఐసీ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆ ఏజెంట్‌లు బ్రాంచ్ మేనేజర్ సతీష్‌కు ఫిర్యాదు చేశారు. ఎల్‌ఐసీ కార్యాలయంలో పనిచేస్తున్న సురేంద్రబాబు, సునీల్ పాలసీదారులను, ఏజెంట్‌లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట, వెంకటగిరి, సూళ్లూరుపేట ప్రాంతాలకు చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్‌లు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ యూరియా


రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ యూరియా అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. సోమవారం మండలంలోని చెన్నూరు గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరానికి ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. చెన్నూరులో 400 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, రైతులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శ్యామల, వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత


గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న జేవీవీ ప్రతినిధులు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం జేవీవీ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం చెంచులక్ష్మి మాట్లాడుతూ గత 12ఏళ్లుగా జేవీవీ ఆధ్వర్యంలో ప్రతినెలా గర్భిణులకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, ప్రభాకర్ రాఘయ్య, శర్మ పాల్గొన్నారు.

ఆలయ పరిధిలోని సమస్యలను పరిష్కరించండి


ముక్కంటి చైర్మన్ సాయిప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆలయ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని జనసేన నాయకులు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సాయిప్రసాద్‌ను కోరారు. సోమవారం ఆలయ పరిపాలన భవనంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ముక్కంటి ఆలయ పరిసర ప్రాంతాల్లో, ఆర్చీలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాయన్నారు. ఇక ఏపీ సీడ్స్ నుంచి అమరజ్యోతి కల్యాణ మండపం వరకు ఏర్పాటు చేసిన నంది స్తంభాలకు మైకులను ఏర్పాటు చేసి నిత్యం శివ నామస్మరణ వినిపించేలా చేసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో కుమార్, జయప్రకాష్, చిరంజీవి, లీలాధర్, ఢిల్లీబాబు, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

రాహుకేతు పూజల పరిశీలన


భక్తులతో మాట్లాడుతున్న ధర్మకర్తల మండలి సభ్యుడు గుర్రప్పశెట్టి

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే రాహుకేతు సర్పదోష నివారణ పూజలను సోమవారం ధర్మకర్తల మండలి సభ్యుడు వాకిచర్ల గుర్రప్పశెట్టి పరిశీలించారు. కార్తీక సోమవారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. దీంతో ఆయన రూ500 రాహుకేతు పూజలు చేసే మండపాన్ని పరిశీలించారు. భక్తులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అదే విధంగా రూ1,500, రూ2,500, రూ5వేలు రాహుకేతు పూజలకు టిక్కెట్లు ఇచ్చే కౌంటర్ల వద్ద క్యూ లైన్లను పరిశీలించారు.

ముక్కంటి సేవలో ఏపీ లోకాయుక్త



శ్రీకాళహస్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని సోమవారం ఏపీ లోకాయుక్త జస్టిస్ రజని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

గుడిమల్లంలో మారుమోగిన శివనామస్మరణ





ఏర్పేడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులతో కిక్కిరిసి పోయింది. విశేష సంఖ్యలో భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపం వెలిగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. గుడిమల్లం ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి, ఏఎస్ఐ ధర్మసింగ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖ అలసత్వం... వ్యాసాశ్రమ విద్యార్థులకు తెలుగు పరీక్ష ఆలస్యం

ఏర్పేడు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అలసత్వంతో సోమవారం జరిగిన సమ్మేటివ్ తెలుగు పరీక్ష ఏర్పేడు వ్యాసాశ్రమం ఎస్వీ హైస్కూల్ విద్యార్థినులు మధ్యాహ్నం పైన పరీక్ష రాశారు. వ్యాసాశ్రమ పాఠశాలకు మండల విద్యాశాఖ అధికారులు సాధారణ పేపరు సరఫరా చేశారు. తీరా పరీక్ష రాసేందుకు ప్రశ్నాపత్రాల బండిల్ ఓపెన్ చేయగా వారికి సిలబస్‌లో లేని తెలుగు పేపర్ రావడంతో తికమకపడ్డారు. ఇక్కడి విద్యార్థులకు సంస్కృతం, తెలుగు సిలబస్ వేరుగా ఉంటుంది. వీరికి ప్రత్యేక ప్రశ్నపత్రం ఉంటుంది. అయితే ప్రశ్నపత్రం వేరేది రావడంతో మళ్లీ అప్పటికపుడు ఆశ్రమ సిబ్బంది శ్రీకాళహస్తికి వెళ్లి సరైన ప్రశ్నాపత్రాలు తెచ్చి విద్యార్థులకు ఆలస్యంగా పరీక్షను నిర్వహించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వరదయ్యపాళెం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈనెల 11న మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలన్నారు.

నేత్రపర్వంగా లక్ష దీపోత్సవం

ముక్కంటి ఆలయానికి పోటెత్తిన భక్త జనం




భరద్వాజతీర్థం వద్ద శివలింగాకృతి దీపాల వద్ద ఎమ్మెల్యే సుధీర్, పాలకమండలి చైర్మన్ సాయి, ఈవో బాపిరెడ్డి తదితరులు - ఆలయం వద్ద భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజతీర్థంలో కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ప్రదోష వేళ లక్ష దీపోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ముక్కంటి ఆలయ అధికారులు ముందుగా భరద్వాజతీర్థం చుట్టూ నేతిదీపాలను సిద్ధం చేశారు. పుష్కరణి ప్రాంగణంలో ముందుగా స్వామి అమ్మవార్లకు విశేష పూజలు చేసి హారతులు సమర్పించారు. అనంతరం లక్ష దీపోత్సవాన్ని చేపట్టారు. నేతి దీపకాంతులతో పుష్కరణి తేజోమయంగా ప్రజ్వరిల్లింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్, ఆలయ పాలకమండలి చైర్మన్ సాయి ప్రసాద్, సభ్యులు, ఈవో బాపిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తుల రద్దీ నెలకొంది. సూర్యోదయ పూర్వమే ఆలయం వద్ద భక్తుల సందడి అధికంగా కనిపించింది. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. భిక్షాల గాలి గోపురం సమీపంలో దీపాలు వెలిగించారు. రద్దీ అధికంగా ఉండటంతో అధికారులు తదనుగుణంగా ఏర్పాట్లు చేపట్టారు. రూ.200శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా 3,933 మంది, రూ.50 ప్రత్యేక ప్రవేశదర్శనం 3,045 జరిగాయి, ఇక ఐదు రకాల రాహుకేతు పూజలు 4,014 జరిగాయి. మొత్తంగా 35వేలమంది భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

కళత్తూరులో కొనసాగుతున్న చేయూత






చీరల పంపిణీలో అంగన్‌వాడీ కార్యకర్తలు - అరుంధతివాడలో ఆర్థిక సాయం - నిత్యావసరాలు, చీరలు పంపిణీ చేస్తున్న కుమారమ్మ

కేవీబీపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దెబ్బతిని బురదమయంగా మారిన కళత్తూరును డీఎల్వో సుస్మిత, ఎంపీడీవో మాలతి, డిప్యూటీ ఎంపీడీవో కరుణాకర్రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కూడా పారిశుధ్య పనులు కొనసాగాయి. పారిశుధ్య కార్మికులు బురదతో నిండిన వస్తువులను వెలుపలికి తీయడంతో మహిళలు పక్కనే ఏట్లో శుభ్రం చేసుకున్నారు. అధికారుల పర్యవేక్షణ కొనసాగుతూనే ఉంది. ఓశ్లూరు సర్పంచ్ సురేష్ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర వస్తువులు, ప్రభుత్వం అందిస్తున్న నగదుతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని అందజేశారు.

చీరల పంపిణీ

మేము సైతం అంటూ అంగన్‌వాడీలు చీరలను పంపిణీ చేశారు. సీఐటీయూ ఆధ్వ ర్యంలో వర్కర్స్ అండ్ హెల్పర్స్ పిచ్చాటూరు ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో కేవీబీపురం, నారాయణవనం, నాగలాపురం, పిచ్చాటూరు అంగన్‌వాడీ కార్యకర్తలు ముంపునకు గురైన బాధితులకు చీరలు పంపిణీ చేశారు. చిన్న జీతం అయినా పెద్దమనసుతో వారు అందించిన సాయానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రాజేశ్వరి, ఇంద్రాణి, కల్యాణి, కృష్ణవేణి, విజయలక్ష్మి, సుభాషిణి, విజయ, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్, మురుగేష్, నాగరాజు, క్రాంతి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, ప్రాంతీయ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆపన్నహస్తం

తిరుపతి(జీవకోన)(ఆంధ్రజ్యోతి): చెరువు కట్ట తెగి నిరాశ్రయులైన కళత్తూరు గ్రామ ప్రజలకు ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ అండగా నిలిచారు. కుమారమ్మ తన సొంత నిధులతో చీరలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆమె వెంట టీడీపీ నాయకులు రామాంజులు నాయుడు, గోపిరెడ్డి, సాధు, సర్పంచ్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో...

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) (ఆంధ్రజ్యోతి): కళత్తూరు బాధితుల ఎస్ఎఫ్ఐ తిరుపతిలో విరాళాలు సేకరించింది. ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఆర్థిక సాయం చేశారు. అనంతరం యూనివర్సిటీ ఉద్యోగులు కూడా విరాళాలు అందించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కళత్తూరులో సహాయక చర్యలకు పంపేలా చూడాలని ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్షుడు నరసన్న, కార్యదర్శి వినోద్, వర్సిటీల కన్వీనర్ అశోక్‌కుమార్ కోరగా చర్యలు తీసుకుంటానని రిజిస్ట్రార్ తెలిపారు.


ఆర్థిక సహాయం చేస్తున్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం ఓశ్లూరు రాయలచెరువుకు గండి పడి కళత్తూరు, కళత్తూరు దళితవాడ, పాతపాళెం దళితవాడ, పాతపాళెం అరుంధతివాడ, ఎస్ఎల్‌పురం ముంపునకు గురయ్యాయని, ఈ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఎమ్మెల్యే ఆదిమూలం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వందలాది పశువులు ప్రాణాలు కోల్పోయాయని, నాలుగైదు గ్రామాల్లో ఇళ్లన్నీ నీట మునిగి బురదలో కూరుకుపోయి నివాసం ఉండలేని పరిస్థితి నెలకొనిందని పేర్కొన్నారు. సహాయక చర్యలు చేపట్టి బాధితులకు అండగా నిలిచిన కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడుతో పాటు ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

కాలువ నిర్మాణ పనుల పరిశీలన

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాజెక్టు వీధిలో జరుగుతున్న కాలువ నిర్మాణ పనులను సోమవారం టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా టౌన్‌బ్యాంకు డైరెక్టర్ ఆర్ముగం మాట్లాడుతూ.. కాలువలు లేకపోవడంతో వీధుల్లో మురుగు చేరి ఇబ్బందికరంగా ఉందని ఎన్నికల సందర్భంగా బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఆయన ఎమ్మెల్యే అయిన తరువాత ఆ హామీని నెర వేర్చుతున్నారన్నారు. ప్రతాప్, సునీల్, హరి, కుమార్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా ఆకాశదీపం

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో సోమవారం ఆకాశదీపం ఆగమోక్తంగా వెలిగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మా సాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఆలయ ఊంజల్ మండపం వద్ద అర్చకులు కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి పాల్గొన్నారు.

ముక్కంటి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి శ్రీకాళహస్తికి చెందిన స్వర్ణలత కుటుంబసభ్యులు రూ.లక్ష, తిరుపతికి చెందిన అమ్మాణి కుటుంబ సభ్యులు రూ.50వేలు అందించారు. విరాళాలు స్వీకరించి వారికి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అన్నాస్వామిపల్లి రోడ్డు మూసివేత

రేణిగుంట నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట నుంచిఅన్నాస్వామిపల్లి, వెంకటాపురం వెళ్లే రోడ్డును మూసివేశారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నుంచి అన్నాస్వామి పల్లెకు వెళ్లే మార్గంలో నూతన రోడ్డు నిర్మిస్తుండడంతో 10 రోజుల పాటు ఈ మార్గాన్ని మూసివేసినట్లు ఎంపీడీవో రవిచంద్ర తెలిపారు.

రైల్వేస్టేషన్లో పోలీసుల తనిఖీ

రేణిగుంట, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వే స్టేషన్ లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సోమవారం రాత్రి దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కారు బాంబు పేలడంతో 13 మంది దుర్మరణం చెందారు. దీంతో ఇంటెలిజెన్స్ హెచ్చరిక మేరకు దేశవ్యాప్తంగా పోలీసులను అప్రమత్తం చేశారు. రాత్రి 8.45 కు రేణిగుంట రైల్వే స్టేషన్‌లో అర్బన్ సీఐ జయచంద్ర నేతృత్వంలో జి ఆర్పీ, ఆర్పీఎఫ్‌తో కలిసి ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు.

ఇంటి స్థల ఆక్రమణపై హిజ్రా ఫిర్యాదు

పిచ్చాటూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీ సమీపంలోని అరుంధతివాడలో తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన ఇంటి స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించారంటూ హిజ్రా ఎస్ఐ వెంకటేష్‌కి ఫిర్యాదు చేశారు. అప్పంబట్టుకు చెందిన విజయన్ తమ స్థలాన్ని ఆక్రమించారని పేర్కొంది. అనంతరం తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పరిశీలించి అసలు లబ్ధిదారులు ఎవరో నిర్ధారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మొదలియార్, దాసరి కార్పొరేషన్లలో సత్యవేడు నేతలకు చోటు

సత్యవేడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన వివిధ కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా సత్యవేడు నియోజకవర్గం నుంచి పలువురు టీడీపీ నాయకులకు చోటు లభించింది. ఇందులో ఏపీ మొదలియార్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నారాయణవనం మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్.భాస్కర్ నియమితులయ్యారు. మరో డైరెక్టర్‌గా నాగలాపురం మండలం వేంబాకంకు చెందిన ఏఎంసీ మాజీ డైరెక్టర్, టీడీపీ మాజీ మండల ప్రధాన కార్యదర్శి కే.నమశ్శివాయం నియమితులయ్యారు. దాసరి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్‌గా నారాయణవనం మండలం అరణ్యంకండ్రిగకు చెందిన కోలా లోకయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి పదవులు అందించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నియోజవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం



శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఈశ్వరయ్యను సోమవారం తిరుపతిలో శ్రీకాళహస్తికి చెందిన ఏఐటీయూసీ నాయకులు సత్కరించారు.శ్రీకాళహస్తి ఏరియా సీపీఐ కార్యదర్శి గురవయ్య, నాయకులు వైఎస్ మణి, మించల శివకుమార్, ఏఐటీయూసీ నాయకులు తొండు మల్లికార్జున్, కార్తీక్, జ్యోతిసాయి, మహేష్, సెల్వ తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 10 ఆంధ్రజ్యోతి): గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. బీఎన్‌కండ్రిగ పీహెచ్‌సీలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉన్న వారికి సుక్రోజ్ ఇంజెక్షన్లు వేశారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌లో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏవో షణ్ముగం, ఏపీఎం మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సమస్యలు తీర్చండి



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయంలో ఆధార్ కార్డులు తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నామంటూ పలువురు గిరిజనులు ఎంపీడీవో వెంకటరత్నమ్మకు సోమవారం విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయం ఆధార్‌కార్డులు తీసే ఆపరేటర్ రమేష్ తప్పులుగా నమోదు చేయడంతో ఇప్పటికి రెండు సార్లు తిరస్కారానికి గురైనట్లు తెలిపారు. ఆధార్ కార్డు కోసం నెల రోజులు నుంచి తిరుగుతున్నట్లు చెప్పారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో ఆధార్‌ను సకాలంలో తీసే విధంగా చేస్తామని హామీ ఇచ్చారు.

స్కిమ్స్‌లో తరగతులు ప్రారంభం



శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుగున్నేరి సమీపంలో ఉన్న స్కిమ్స్ కళాశాలలో సోమవారం తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మిద్దెల హరి మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతులకు సక్రమంగా హాజరై నైపుణ్యాలతో పాటు నైతిక విలువలను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీకుమార్, అతిథులు రఘురామిరెడ్డి, సత్యనారాయణరావు, అన్వర్‌ఖాన్, చంద్రశేఖర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్‌కు నివాళులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా వ్యాప్తికి కృషి చేసిన సి.పి. బ్రౌన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వాణి ఆధ్వర్యంలో ఆయనకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు యువశ్రీ మురళి మాట్లాడుతూ పలు తాళపత్రాలను పరిష్కరించి శుద్ధ ప్రతులను తయారు చేశారన్నారు. బ్రౌన్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వ అధికార కార్యక్రమంగా నిర్వహించడం శుభపరిణామన్నారు.